“ మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

“ మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 13-12-2025

జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 1 Volume:1 | సంచిక: 164 Issue: 164

13 డిసెంబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:41 సూర్యాస్తమయం - సా. 5:39 తిథిః నవమి సా. 4:41 వరకు తరువాత దశమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం హస్త ఉ. 8:11o వరకు యోగం ఆయుష్మాన్ ఉ. 11:16 వరకు కరణం గరజి సా. 4:41 వరకు వనిజ తె. 5:41o వరకు వర్జ్యం మ. 3:06 నుండి సా. 4:52 వరకు దుర్మహూర్తం ఉ. 8:09 నుండి ఉ. 8:52 వరకు రాహుకాలం ఉ. 9:25 నుండి ఉ. 10:47 వరకు యమగండం మ. 1:32 నుండి మ. 2:54 వరకు గుళికాకాలం ఉ. 6:41 నుండి ఉ. 8:03 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:05 నుండి తె. 5:53 వరకు అమృత ఘడియలు రా. 1:40 నుండి తె. 3:26 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:32 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial

www.evarthalu.com




## మెస్సీ వస్తున్నాడు!

**నేడు హైదరాబాద్‌కు ‘గోట్’.. సాయంత్రం సీఎంతో కలిసి మ్యాచ్**

ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఇండియా టూర్ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ‘గోట్ టూర్ ఆఫ్ ఇండియా’ నామకరణంతో జరిగే ఈ కార్యక్రమంలో మెస్సీ.. హైదరాబాద్, ముంబయి, న్యూఢిల్లీలో స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడనున్నారు. శనివారం తెల్లవారుఝూమున మెస్సీతోపాటు ఇంటర్ మియామీ ఆటగాళ్లు రోడ్రిగో-డి-పాల్, లూయిస్ సువారేజ్ కోల్‌కతా చేరుకోనున్నారు.

న్యూఢిల్లీ: కళాకారుడు మోంటి పాల్ తయారు చేసిన ‘మాన్యుమెంటో-డి-మెస్సీ’ పేరుతో తయారు చేసిన 70 అడుగుల విగ్రహాన్ని మెస్సీ ప్రారంభిస్తారు. అనంతరం యువ భారతి క్రిరంగన్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ స్టార్ షారుక -2 వ పేజీలో...



## బుడ్డోడు ‘ఆరే’శాడు!

**శతక్కొడుతున్న వైభవ్ సూర్యవంశీ**

**ఆరు టోర్నమెంట్లలో ఆరు శతకాలు**

14 ఏళ్ల సంచలనం.. వైభవ్ సూర్యవంశీ.. క్రికెట్ చరిత్రలో సరికొత్త రికార్డ్‌ను తన పేరున సువర్ణ అక్షరాలతో లిఖించుకున్నాడు. ఒకే ఫార్మాట్‌లో నిలకడగా రాణించడం కష్టమైన ఈ రోజుల్లో అద్భుతమైన ప్రతిభతో వైభవ్ సూర్యవంశీ ఏకంగా ఆరు వేర్వేరు టోర్నమెంట్‌లలో సెంచరీలు సాధించి వరల్డ్ రికార్డ్‌ను సాధించాడు. 2

## పదెకరాలు నొక్కేద్దామనుకున్నరు!

**కబ్జాదారుల కోరలు పీకిన హైడ్రా**


**రూ.750 కోట్ల ప్రభుత్వ భూమి సేఫ్**




హైదరాబాద్ శివారు ప్రాంతం నిజాంపేటలో రూ.750 కోట్ల ప్రభుత్వ భూమిని హైడ్రా కబ్జాదారుల చెర నుంచి కాపాడింది. నిజాంపేటలో సర్వే నంబర్ 191లో ఉన్న 10 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది.

నిజాంపేట, డిసెంబర్ 12 (ఈవార్తలు): ప్రభుత్వ భూమి కబ్జా గురించి ఫిర్యాదులు అందడంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణలు తొలగించారు. కబ్జాకు గురైన భూమి విలువ మార్కెట్ విలువ ప్రకారం రూ.750 కోట్లకు పైగా ఉంటుంది. గత కొంతకాలంగా ఈ భూమిని ఆక్రమిస్తూ వస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు చేశారు స్థానికులు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు రెవెన్యూ అధికారులతో కలిసి తరువాయి 2 వ పేజీలో...

# ఏ కులం.. మీది?




## జనాభా లెక్కలతో పాటు కులగణన

**రెండు దశల్లో సెన్సస్-2027 నిర్వహణ.. లెక్కల కోసం రూ.11,718 కోట్ల బడ్జెట్**

**30 లక్షల మంది సిబ్బందికి బాధ్యతలు.. తొలి సారి డిజటల్ విధానంలో ప్రక్రియ**

**‘పూజ్య బాపు ఉపాధి పథకం’గా నరేగా.. కేంద్ర కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు**

భారత జనాభా లెక్కలు- 2027 నిర్వహణకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. దీని కోసం రూ. 11,718.24 కోట్ల ఖర్చు చేయనుంది. ఇది చాలా కాలం తర్వాత దేశంలోనే అతిపెద్ద పరిపాలనా, గణాంక ప్రక్రియగా నిలవనుంది. జనాభా లెక్కింపు రెండు దశల్లో నిర్వహించబడుతుంది.

న్యూఢిల్లీ: గృహాల జాబితా, గృహ గణన వచ్చే ఏప్రిల్ నుండి సెప్టెంబర్ 6 వరకు జరుగుతుంది. రెండో దశ ఫిబ్రవరి 2027లో జనాభా గణన జరుగుతుంది. లడఖ్, మంచుతో కప్పబడే, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని సమకాలిక ప్రాంతాలకు మాత్రం 2026 సెప్టెంబర్‌లోనే నిర్వహించనున్నారు. ఈసారి జనగణనలో కులం ఆధారిత గణనను కూడా చేర్చారు. రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఏప్రిల్ 30, 2025న కుల గణనను చేర్చాలని నిర్ణయించింది. దీని ప్రకారం, రెండవ దశ అయిన జనాభా గణన సమయంలో కుల డేటాను ఎలక్ట్రానిక్ పద్ధతిలో సేకరిస్తారు. కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, ఆమోదాలను కేంద్ర సమాచార ప్రసార శాఖ తరువాయి 2 వ పేజీలో...

## రేవంత్‌తో అఖిలేశ్ భేటీ

**జాతీయ రాజకీయాలపై చర్చ.. కేటీఆర్‌తోనూ సమావేశం**



హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ శుక్రవారం హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్‌తో విడివిడిగా సమావేశమయ్యారు. ముందుగా జూబ్లీ హిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు గంటకు పైగా జరిగిన ఈ సమావేశంలో ఇరువురు నేతలు తాజా రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. ఈ భేటీ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ తరువాయి 2 వ పేజీలో...

## సమ్మిట్ చారిత్రక విజయం

**క్యాన్సర్ చికిత్సలో తెలంగాణ గ్లోబల్ లీడర్.. సీఎంకు నోరి దత్తాత్రేయ లేఖ** 3

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,320 |
| వెండి (గ్రాము): | రూ.215 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,920 |



## నాకు తెల్వకుండానే అఖండ2 జీవో

**రేట్ల పెంపు అని నా దగ్గరికి రావొద్దు**

**భవిష్యత్తులో ఎలాంటి అనుమతులివ్వం**

**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): తనకు తెలియకుండానే అఖండ 2 టికెట్ రేట్ల పెంపునకు జీవో ఇచ్చారని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ‘నేను కొన్ని రోజులుగా బిజీగా ఉన్నా. అందుబాటులో లేను. అటు ఎన్నికల ప్రచారం, గ్లోబల్ సమ్మిట్ డిబేట్స్ తో బిజీగా ఉన్నా. నా దృష్టిలో లేకుండా ఇటీవల ఆర్డర్ ఇచ్చారు. అనుమతులు తరువాయి 2 వ పేజీలో...

## సీఎం అవుతా.. తోలు తీస్తా!

**మాధవరం వెనుక ఓ గుంట నక్క**

**నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నరు**

**టీ న్యూస్, ఇద్దరు ఎమ్మెల్యేలకు లీగల్ నోటీసులు**

**చిట్టా మొత్తం ఈడీ, సీబీఐకి పంపిస్తా**

**కల్వకుంట్ల కవిత స్ట్రాంగ్ వార్నింగ్స్**



హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): ‘నాకు కూడా టైమ్ వస్తుంది.. దేవుడి దయ ఉంటే, నేను కూడా ఏదో ఒక రోజు సీఎం అవుతా.. నేను సీఎం అయితే 2014 నుంచి జరిగిన అన్ని విషయాలపై విచారణ చేయిస్తా’ అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై, తన భర్తపై అసత్య ఆరోపణలు చేసిన ఎవ్వరినీ వదిలిపెట్టనని హెచ్చరించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... తన గురించి, తన భర్త గురించి తప్పుడు, పరువు నష్టం కలిగించే విధంగా టీ న్యూస్ కథనాలను ప్రసారం చేసిందని ఆరోపించారు. అలాగే తరువాయి 2 వ పేజీలో...



## కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్

**గ్రామాల నుంచే హస్తం పతనం ప్రారంభం**

**సగం సీట్లను కూడా గెలవలేకపోయింది**

**ప్రభుత్వంపై వ్యతిరేకతకు ఇది నిదర్శనం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన చోట కనీసం 44 శాతం సీట్లను కాంగ్రెస్ పార్టీ దాటకపోవడం.. ప్రభుత్వంపై పెరిగిన ప్రజావ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శమన్నారు. పంచాయతీ ఎన్నికలు అధికార పార్టీకి కొంత అనుకూలంగా ఉంటాయని తొలుత ప్రచారం జరిగిందని తెలిపారు. కానీ రేవంత్ పరిపాలనా వైఫల్యంపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఈ ఎన్నికల ఫలితాల ద్వారా రుజువైందని స్పష్టం చేశారు.

హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): తొలి విడత పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా.. బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులు హెూరాహెూరీగా పోరాడి.. సర్పంచులు, వార్డు మెంబర్లుగా గెలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడినా మొక్కవోని ధైర్యంతో అధికార పార్టీ అరాచక పర్వాన్ని ఎదుర్కొన్నారంటూ వారిని ప్రశంసించారు. ఈ సందర్భంగా గులాబీ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



కాకులు అంటేనే నల్లగా ఉంటాయి. ఇతర రంగుల్లో ఉండటం చూసిందే లేదు. కానీ, తొలిసారి ఫిలిప్పీన్స్‌లో ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ జూన్ రే యాప్.. తెల్లని కాకిని గుర్తించాడు. వెంటనే తన కెమెరాల్లో క్లిక్‌మనిపించాడు. అయితే, తెల్లని రంగు కాకికి.. రంగు సంబంధిత జన్యు పరమైన లోపమా? లేక తెల్లని కాకుల జాతి కూడా ఉందా? అన్న కోణంలో పరిశోధకులు పరిశోధనలు ప్రారంభించారు. 10 లక్షల నల్లని కాకులకు ఒక తెల్లని కాకి ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు.



## మంచు రూపంలో మృత్యువు


**తొమ్మిది మంది దుర్మరణం.. 27 మందికి తీవ్ర గాయాలు**

**ఏపీలో అదుపుతప్పిన బస్సు.. ఏపీలోని అల్లూరి జిల్లాలో ఘటన**

## నల్లమలసాగర్‌పై సుప్రీంకు

**తెలంగాణ సర్కారు నిర్ణయం**

**ఏపీ ప్రాజెక్టుపై అభ్యంతరం**



హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ అభ్యంతరాలు కోర్టులో దాఖలు చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వితో వాదనలు వినిపించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన ఏపీ ప్రభుత్వం.. ఆ ప్రక్రియను టెండర్ల వరకూ తీసుకెళ్లింది. అయితే.. రాష్ట్రప్రభుత్వం ఆ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకించడంతో తరువాయి 2 వ పేజీలో...

ఈవార్తలు



## రాశి ఫలాలు
13.12.2025

మేషం: కొన్ని పనులు వాయిదా పడతాయి. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. నూతన రుణాలు చేస్తారు. ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. జీవిత భాగస్వామితో చిన్నపాటి మాటపట్టింపులుంటాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారించడం మంచిది. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

వృషభం: కొన్ని వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. విలువైన వస్తు,వస్త్ర లాభాలు పొందుతారు. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

మిధునం: దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు విస్తరిస్తారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. రాజకీయ సంభంధిత సభ, సమావేశాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి.

కర్కాటకం: గృహమున ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. స్థిరస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. ఉద్యోగాలలో పనిభారం తగ్గుతుంది. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో అందుతాయి.

సింహం: కుటుంబ సభ్యులతో చర్చలు సఫలమౌతాయి. వ్యాపారమున స్వంత నిర్ణయాలతో ముందుకు సాగడం మంచిది. రావలసిన సొమ్ము సకాలంలో చేతికందుతుంది. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు అనుకులిస్తాయి. బంధువులతో మాటపట్టింపులు తొలగుతాయి.

కన్య: ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి విషయాలు జ్ఞాప్తికి వస్తాయి. స్థిరస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధువులతో సఖ్యత కలుగుతుంది.

తుల: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఇంటాబయట సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపించదు. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

వృశ్చికం: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు ఉత్సాహనిస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో మీ విలువ మరింత పెరుగుతుంది. నూతన వాహనయోగం ఉన్నది. భూవివాదాల పరిష్కారమౌతాయి. విద్యార్థులకు అనుకూల ఫలితాలు ఉంటాయి.

ధనస్సు: కొన్ని వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. సోదరులతో సఖ్యత లోపిస్తుంది. కుటుంబ సభ్యులతో కొద్దిపాటి సమస్యలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు తప్పవు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. దైవచింతన పెరుగుతుంది. బంధు మిత్రులతో అకారణ వివాదాలుంటాయి.

మకరం: చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో సమస్యలు పరిష్కారమౌతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. ధన, వస్తువులు బహుమతులుగా పొందుతారు.

కుంభం: వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా సాగుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. సన్నిహితులతో సఖ్యత కలుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. విందువినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది.

మీనం: వృత్తి వ్యాపారలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన వ్యవహారాలు మందగిస్తాయి. బంధువులతో తగాదాలు చికాకు పరుస్తాయి. ఉద్యోగాలలో అధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. నూతన రుణాలు చేస్తారు.

# ఏ కులం..మీది?

**మొదటి పేజీ తరువాయి**

మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 2027 జనాభా లెక్కలను రెండు దశల్లో నిర్వహిస్తామని చెప్పారు. భారత్‌లో నిర్వహించనున్న ఈ జనాభా లెక్కలు 16వది అని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చేపడుతున్న 8వ జనగణన అని తెలిపారు. భారతదేశ జనాభా లెక్కలను ప్రపంచంలోనే అతిపెద్ద పరిపాలన, గణాంక ప్రక్రియగా పరిగణిస్తున్నట్లు వెల్లడించారు. కుల గణనను జనాభా లెక్కల సేకరణ 2027లో చేర్చనున్నామని చెప్పారు. 2025 ఏప్రిల్ 30న జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో రాబోయే జనాభా లెక్కల్లో అంటే 2027 జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు తదుపరి జనాభా లెక్కల్లో కులగణనను కూడా చేర్చుతున్నారు. అయితే దేశంలో మొట్టమొదటి సారిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ చేపడుతున్నట్టుగా అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఆండ్రాయిడ్, ఐవోఎస్ వెర్షన్‌లకు అందుబాటులో ఉండే మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి డేటాను సేకరిస్తారని



చెప్పారు. జనాభా లెక్కల సేకరణలో క్షేత్రస్థాయిలో 30 లక్షల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన ఎన్యూమరేటర్లు వారి సాధారణ విధులతో పాటు జనాభా లెక్కల క్షేత్రస్థాయి పని చేపడతారు. 2027 జనాభా లెక్కలు... దేశంలోని మొత్తం జనాభాను కవర్ చేస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా నియమించిన సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించనున్నారు. గృహాల జాబితా, గృహ గణన, జనాభా గణన కోసం రూపొందించి ప్రత్యేక ప్రశ్నాపత్రంలోని అంశాలకు సమాధానాలను సేకరించడం చేపట్టనున్నారు. మొత్తం జనగణన ప్రక్రియను రియల్ టైమ్ ప్రాతిపదికన నిర్వహించడానికి, పర్యవేక్షించడానికి సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎంఎస్) పోర్టల్ అనే ప్రత్యేక పోర్టల్‌ను డెవలప్ చేశారు. రెండు దశలలో జనాభా లెక్కలు... తొలి దశలో భాగంగా 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు గృహాల జాబితా, గృహ గణన చేపట్టనున్నారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా గణన నిర్వహించనున్నారు. అయితే లధక్, జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో మంచుతో కప్పబడిన రిమోట్ ప్రాంతాల్లో 2026 సెప్టెంబర్‌లోనే జనగణన చేపట్టనున్నారు.

### కోల్ సేతు విండోకు ఆమోదం

'కోల్ సేతు విండో'కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బొగ్గు గనుల రంగంలో సంస్కరణల కోసం కొత్త పాలసీకి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. కొబ్బరికి మద్దతు ధర ప్రకటించిన కేంద్ర కేబినెట్.. 2026 సీజన్‌లో క్వింటాల్ మిల్లింగ్ కొబ్బరికి క్వింటాల్‌కు రూ.445 రూపాయలు, బాల్ కొబ్బరి క్వింటాలుకు రూ.400 మద్దతు ధర పెంచింది. మిల్లింగ్ కొబ్బరి క్వింటాలు ధర రూ.12,027, బాల్ కొబ్బరి ధర రూ.12,500గా ప్రకటించింది. ఇక.. ఉపాధి హామీ పథకం పేరు మార్పునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పూజ్య బాపు గ్రామీణ ఉపాధి హామీ పథకంగా మార్పు చేసింది. పనిదినాలు ఏడాదికి 120 రోజులకు పెంచింది. ఈ పథకాన్ని మొదట జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005గా ప్రారంభించగా.. తరువాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా మార్చారు. తాజాగా.. 'పూజ్య బాపు ఉపాధి హామీ పథకం'గా మారుస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది.

# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్

**మొదటి పేజీ తరువాయి**

సైనికులందరికీ ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల కోసం సాక్షాత్తూ ముఖ్యమంత్రే జిల్లాల్లో పర్యటించి ప్రచారం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇక ప్రత్యామ్నాయం కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని తొలిదశ పంచాయతీ ఫలితాల ద్వారా స్పష్టమైందన్నా రు. రానున్న మూడేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. పల్లెల్లో పైసా అభివృద్ధి పని జరగదని గ్రామస్తులు ఒక నిర్ధారణకు వచ్చేశారని చెప్పారు. అందువల్లే పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి ఇంతటి ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయని వివరించారు. సగం స్థానాలు కూడా కాంగ్రెస్ గెలవకపోవడం.. పలు ప్రాంతాల్లో 10, 20 ఓట్ల తేడాతోనే బయట పడటం చూస్తే కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్ పల్లెల నుంచే ప్రారంభమైందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రెండేళ్లు గడిచినా ఆరు గ్యారెంటీల పేరిట.. పెన్షన్ల పెంపు, మహాలక్ష్మి, తులం బంగారం హామీ పేరిట చేసిన నయవంచనను గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంకా మరిచిపోలేదని తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయన్నారు. యూరియా బస్తాల కోసం నెలల తరబడి పడిన అగచాట్లు, బోనస్ పేరిట చేసిన బోగస్ హామీ, చివరికి పండించిన పంటను అమ్ముకో లేక పడ్డ కష్టాలను అన్నదాతలు గుర్తు పెట్టుకున్నారని ఈ ఫలితాలు రుజువు చేశాయన్నారు. పదేళ్లపాటు ప్రగతిపథంలో సాగిన పల్లెల్లో.. గత రెండేళ్లుగా పాలన పడకేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గాడి తప్పిన పారిశుధ్యం, చివరికి ట్రాక్టర్లలో డీజిల్ పోయలేని దుస్థితి పల్లె ప్రజలను ఆలోచింప జేసినట్టు ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ఇది ఆరంభం మాత్రమే అని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలతో మొదలైన కాంగ్రెస్ పతనం రానున్న రోజుల్లో పాతాళానికి పడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం తథ్యమని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## బుడ్డోడు 'ఆరే'శాడు!

**14 ఏళ్ల సంచలనం..** వైభవ్ సూర్యవంశీ.. క్రికెట్ చరిత్రలో సరికొత్త రికార్డ్‌ను తన పేరున సువర్ణ అక్షరాలతో లిఖించుకున్నాడు. ఒకే ఫార్మాట్‌లో నిలకడగా రాణించడం కష్టమైన ఈ రోజుల్లో అద్భుతమైన ప్రతిభతో వైభవ్ సూర్యవంశీ ఏకంగా ఆరు వేర్వేరు టోర్నమెంట్‌లలో సెంచరీలు సాధించి వరల్డ్ రికార్డ్‌ను సాధించాడు. ఆరు విభిన్న ఫార్మట్‌లలో స్థిరంగా తన ప్రదర్శనను కొనసాగిస్తున్న వైభవ్, త్వరలోనే సీనియర్ టీమ్ ఇండియా జట్టులోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు.

6 టోర్నమెంట్లలో 6 సెంచరీలు

ఐపీఎల్: ఇండియన్ ప్రీమియర్ లీగ్లో శతకం

యూత్ టెస్ట్: సుదీర్ఘ ఫార్మాట్‌లో సెంచరీ

యూత్ వన్డే: యూత్ వన్డేలలో అద్భుత శతకం

ఇండియా-ఏ: ఇండియా-ఏ సెంచరీ

ఎస్ఎమ్ఏటీ: దేశవాళీ టీ20 టోర్నీ

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సూపర్ శతకం

యూ-19 ఆసియా కప్: యూఏఈపై మెరుపు సెంచరీ

## నాకు తెల్వకుండానే అఖండ2 జీవో

**మొదటి పేజీ తరువాయి**

జారీ చేశారు' అని వ్యాఖ్యానించారు. ఇకపై రాష్ట్రంలో ఎలాంటి సినిమాకు కూడా టికెట్ ధరలు పెంచే అవకాశం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. అంతే కాదు.. సినిమా నిర్మాతలు, దర్శకులు టికెట్ ధరలు పెంచమని తమ వద్దకు రావొద్దని తెలిపారు. 'పుష్ప-2 సమయంలోనే ఇకపై టికెట్ రేట్లు పెంచమని, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వమని అసెంబ్లీలో చెప్పాం. సినిమా అనేది మధ్యతరగతి, దిగువ మధ్య తరగతికి సంబంధించినది. ఇష్టం ఉన్నట్లు రేట్లు పెంచుతున్నారు. ప్రస్తుతం ఏ సినిమా వచ్చినా.. కుర్రాళ్లు కచ్చితంగా చూడాలని అనుకుంటున్నారు. సినిమాలకు నెల జీతం పోతుంది' అని అభిప్రాయపడ్డారు. 'హైకోర్టు చెప్పిన ఆదేశాల ప్రకారం ఇటీవల అనుమతులు ఇచ్చాం. అయినా చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా.. సంబంధిత శాఖ మంత్రిగా ఇకపై ఎవరూ కూడా మాకు రిక్వెస్ట్ చేయొద్దని కోరుతున్నా. దయచేసి రేట్లు పెంచమని మా దగ్గరకు రావద్దు. కోర్టు నిర్ణయాన్ని గౌరవించి.. భవిష్యత్తులో ఎలాంటి అనుమతులు ఇవ్వం. నిజానికి అనుమతులు ఇవ్వమని అనుకున్నాం. ఇప్పుడు జరిగిన పొరపాటును గ్రహించాం.

## మెస్సీ వస్తున్నాడు!

**మొదటి పేజీ తరువాయి**

ఖాన్, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా పాల్గోనున్నారు. అనంతరం కొద్దిమంది చిన్నారులతో మెస్సీ కలవనున్నట్లు 'గోట్ టూర్' ముఖ్య సలహాదారు షాజీ ప్రభాకరన్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.05కు ముగుస్తుందని బిద్ధానగర్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ అనీశ్ సర్కార్ తెలిపారు. శనివారం సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్ చేరుకొని ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో కలిసి 'గోట్ కప్' ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ప్రారంభిస్తారు. 14న ముంబైలోని వాంఖడే స్టేడియంలో, 15న న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు ఆడనున్నారు. తిరుగు ప్రయాణానికి ముందు ప్రధానితో మెస్సీ బృందం కలవనుంది.

## పదెకరాలు నొక్కేద్దామనుకున్నరు!

**మొదటి పేజీ తరువాయి**

క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. విచారణలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు తేలడంతో చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న 10 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

## నల్లమలసాగర్‌పై సుప్రీంకు

**మొదటి పేజీ తరువాయి**

వెనక్కి తగ్గింది. టెండర్ల ప్రక్రియను వెంటనే వెనక్కి తీసుకుంది. తాజాగా ఏపీ ప్రభుత్వం పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టును చేపడుతుండటంతో సాగునీటి వివాదం మళ్లీ మొదటికొచ్చింది. ఏపీ నిర్మించాలనుకుంటున్న నల్లమలసాగర్‌పై తెలంగాణ తీవ్రంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నది. అందుకే సుప్రీంకోర్టులో అధికారికంగా అభ్యంతరాలు దాఖలు చేయాలని నిర్ణయించింది. ఈ కేసులో తెలంగాణ తరపున వాదించేందుకు సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీని కోరింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో దీనిపై కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి, న్యాయ బృందం, సాగునీటి, పర్యావరణ నిపుణులతో చర్చించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా భారీగా నీటిని లిఫ్ట్ చేసి సమీపంలోని ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమవుతున్నది. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాలపై తీవ్రమైన ప్రభావం పడనుంది. తద్వారా కృష్ణా నదిలో వాటా కింద తెలంగాణకు లభించాల్సిన నీటి పరిమాణం తగ్గే ప్రమాదం ఉంది. అందుకే ఈ అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. వాస్తవానికి ఈ ప్రాంతాన్ని ఎకో సెన్సిటివ్ జోన్‌గా యూఎన్ ప్రకటించింది. అయినప్పటికీ ఏపీ ప్రభుత్వం పోలవరం-నల్లనలసాగర్ ప్రాజెక్టుపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలంగాణ ఆరోపిస్తున్నది. పోలవరం అంచనా వ్యయాలు, డ్యాం సేఫ్టీ అనుమతులు, కట్‌అఫ్ వాల్యూ లెక్కింపు మొదలైన అంశాల్లో తెలంగాణ ప్రమేయం లేకుండానే ఏపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకున్నదని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది.

## రేవంత్‌తో అఖిలేశ్ భేటీ

**మొదటి పేజీ తరువాయి**

కార్యక్రమాలను సీఎం రేవంత్ రెడ్డి అఖిలేశ్ యాదవ్‌కు వివరించారు. జాతీయ రాజకీయాల్లో తెలంగాణ రాష్ట్రంలో 'ఇండియా' కూటమి ప్రభావం గురించి అఖిలేశ్ యాదవ్ ప్రశంసించారు. ఇరు పార్టీల మధ్య రాజకీయ సంబంధాలను ఈ సమావేశం మరింత బలోపేతం చేస్తుందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ కీలక సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ సీనియర్ నేత రోహిణ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

### కేటీఆర్‌తో భేటీ

నందినగర్‌లోని తన నివాసానికి వచ్చిన అఖిలేష్‌ను కేటీఆర్ సాదరంగా స్వాగతం పలికారు. ఆయనతో పాటు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కూడా మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం అఖిలేశ్ కేటీఆర్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జాతీయ రాజకీయాల గురించి ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల గురించి ఇరువురు నేతలు చర్చించుకున్నట్లు సమాచారం. ఉత్తరప్రదేశ్, తెలంగాణలోని రాజకీయ పరిస్థితులపై అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది. ఈ సమావేశ వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది. కాగా, కేటీఆర్-అఖిలేశ్ యాదవ్ భేటీ.. జాతీయ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల పాత్ర, వ్యూహాల అంశాలపై చర్చకు దారి తీసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## సీఎం అవుతా.. తోలు తీస్తా!

**మొదటి పేజీ తరువాయి**

బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన గురించి తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. టీ న్యూస్‌కు, ఇద్దరు ఎమ్మెల్యేలకు లీగల్ నోటీసులు పంపుతున్నానని తెలిపారు. వారం రోజుల్లో తనపై, తన భర్తపై చేసిన తప్పుడు ఆరోపణలకు సంబంధించి బహిరంగ క్షమాపణలు చెప్పాలని... లేకుంటే కోర్టుకు లాగుతామని హెచ్చరించారు. తన భర్త ఎప్పుడూ కూడా ప్రభుత్వ భూమితో, ఆస్తులతో వ్యాపారం చేయలేదని... ప్రైవేట్ భూములతోనే వ్యాపారం చేశారని కవిత పేర్కొన్నారు. తనకు గానీ, తన భర్తకు గానీ ఐడీపీఎల్ సమీపంలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. హరీశ్, బీఆర్ఎస్ పార్టీ తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌తో అంటకాగుతున్నట్లు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఏవీ రెడ్డితో వ్యాపారం చేస్తున్న పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఎవరి దోస్త్? ఎవరి బినామీ? అని ప్రశ్నించారు. పోచంపల్లి పందెం కోళ్ల కేసు ఏమైంది? అని అడిగారు. తాను టార్గెట్ చేసే అంతా పెద్ద వ్యక్తి మాధవరం కృష్ణారావు కాదని తెలిపారు. ఇది మాధవరం కృష్ణారావు వెనక ఉన్న గుంట నక్కకు చెబుతున్నామని చెప్పారు. ఆ గుంట నక్క, ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఆ అధికారి చిట్టా మొత్తం ఈడీ, సీబీఐకి పంపిస్తానని తెలిపారు. తాను పైరవీలు చేసుకోలేదని అన్నారు. తాను తెలంగాణ నుంచి తొలి ఎంపీగా ఢిల్లీలో రాష్ట్రం కోసం కొట్లాడితే... ఇక్కడున్నవాళ్లు కేసీఆర్ నీడన చేరి ఏసీ ఆఫీసుల్లో ఉండి ప్రజల సొత్తును పందికొక్కుల మాదిరిగా దోచుకున్నారని మండిపడ్డారు. ఉల్టా తన మీద వెకిలి చేష్టలకు పాల్పడితే కాళ్లు విరగగొడతానని హెచ్చరించారు. ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేశారు కదా అంటూ ఆవేద వ్యక్తం చేశారు. పార్టీ నుంచి వెళ్లగొట్టారు కదా.. ఇంకా కళ్లు చల్లబడలేదా? అని ప్రశ్నించారు. ప్రణీత్ ప్రణవ్ విల్లాల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు కుమారుడు భాగం అని.. అక్కడ వారు ఒక చెరువును ఆక్రమించి ప్రజలకు ప్రవేశం నిరాకరించారని.. హైడ్రాకు ధైర్యం ఉంటే వారు ఆక్రమణలను తొలగించి, చెరువుకు దారి సృష్టించాలని కోరారు. హిల్ట్ పాలసీకి బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే, కాంగ్రెస్ ద్వారాలు తెరుస్తోందని ఆరోపించారు.

# మంచు రూపంలో మృత్యువు

అల్లూరి జిల్లా, డిసెంబర్ 12 (ఈవార్తలు): ఏపీలోని అల్లూరి జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపు తప్పి లోయలో పడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులుండగా.. అందులో 9 మంది మృతి చెందారు. ఈ దుర్ఘటనలో 27 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. బస్సు అరకు నుంచి భద్రాచలం వెళ్తుండగా, తెల్లవారుజాము నాలుగున్నర ప్రాంతంలో చింతూరు- మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. చాలామంది ప్రయాణికులు ఊపిరాడక మరణించారు. ఒకరిపై ఒకరు పడడంతోపాటు.. బస్సు బరువు కూడా ప్రమాదానికి కారణంగా మారింది. ఇక క్షతగాత్రులను చింతూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదఘటన జరిగిన తర్వాత చాలా సేపు వారికి సహాయకచర్యలు అందకపోవడం వల్లే మృతుల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలం దట్టమైన అడవి కావడంతో భారీగా చలి కూడా ఉంది. దీంతో క్షతగాత్రులు వణికిపోయారు. దాదాపు గంటా, గంటన్నర తర్వాతగాని సహాయకచర్యలు అందలేదు. సిగ్నల్ లేని ప్రాంతం కావడంతో 108 అంబులెన్స్ కూడా సమాచారం ఆలస్యంగా అయినట్లు తెలిసింది.

### పొగ మంచుతో దారి కనిపించకే..

దట్టమైన పొగమంచుతో దారి కనిపించకపోవడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. మలుపు దగ్గర డ్రైవర్ బస్సును కంట్రోల్ చేయలేకపోయారని, ఘాట్‌రో... ర్నీ డ్రైవర్‌కు కొత్త...వడం వల్లే బోల్తా కొట్టిందా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఘాట్‌రోడ్డు ప్రమాదంలో మృతులంతా చిత్తురు, బెంగళూరు వాళ్లేనని తెలుస్తోంది. శ్రీకూర్మం నుంచి భద్రాచలం వరకూ పుణ్యక్షేత్రాలు కవర్ చేసేలా.. ప్రైవేట్ ట్రావెల్స్‌లో టూర్‌కి 36 మంది బయలుదేరారు. బస్సులో బెంగుళూరు వాళ్లు 12 మంది, చిత్తూరు వాళ్లు 24 మంది ఉన్నారు.

### మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు

ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.2 లక్షలు, కేంద్రం నుంచి మృతుల కుటుంబాలకు మరో రూ.2 లక్షలు పరిహారంగా ప్రకటించింది. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబాలను ఏపీ మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, అనిత పరామర్శించారు. మంత్రి అనిత మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రమాదంలో చనిపోవడం బాధాకరమని అన్నారు. శీతాకాలంలో ఘాట్‌రోడ్డులో రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాలు నిలిపివేస్తామని పేర్కొన్నారు.

### ఘాట్ రోడ్డులో రాకపోకలు బంద్

లోయ ఘటన నేపథ్యంలో మంత్రి అనిత ఆదేశాలతో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. అల్లూరి జిల్లాలో ఘాట్ రోడ్లు, వంతెనలపై వాహనాల రాకపోకల మీద ఆంక్షలు విధించారు. శీతాకాలం కావటంతో పొగమంచు ఎక్కువగా కురుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ




## క్యాన్సర్ చికిత్సలో తెలంగాణ గ్లోబల్ లీడర్

## సీఎం రేవంత్‌కు నోరి దత్తాత్రేయ లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 విజయవంతంగా నిర్వహించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అభినందించారు. ఈ మేరకు క్యాన్సర్ చికిత్సలో తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా నిలబడే అవకాశాలున్నాయని అన్నారు. గ్లోబల్ సమ్మిట్ చారిత్రాత్మక విజయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై తెలంగాణ పోటీ పడటానికి తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ఉ పయోగపడుతుందని...రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, జీవన ప్రమాణాల పెంపు కోసం చేస్తున్న ప్రయత్నాలు హర్షనీయమని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పేర్కొన్నారు. ప్రజారోగ్యంలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి పెట్టుబడులు ఉపయోగపడుతాయని చెప్పుకొచ్చారు. క్యాన్సర్ చికిత్సలో తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా నిలబడే అవకాశాలున్నాయని చెప్పుకొచ్చారు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 విజయవంతంగా నిర్వహించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గ్లోబల్ సమ్మిట్ చారిత్రాత్మక విజయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.డీప్‌టెక్, గ్రీన్‌ఎనర్జీ, లైఫ్ సైన్సెస్ వంటి రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం తెలంగాణ రైజింగ్ విజన్-2047 విజన్‌కు అద్దం పడుతుందని చెప్పుకొచ్చారు.రూ. లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన, స్థిరత్వం, భవిష్యత్తుపైన ఉన్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పుకొచ్చారు. ప్రపంచ దిగ్గజాలను హైదరాబాద్, ఫ్యూచర్ సిటీకి రప్పించి తెలంగాణను భారత దేశ స్టార్టప్‌గా....మానవ వనరుల అభివృద్ధికి తెలంగాణ ప్రపంచ కేంద్రంగా మారుతుందని రేవంత్ రెడ్డి రుజువు చేశారని అభినందించారు. మరోవైపు భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు, ఆర్థికవేత్త ప్రొ. అరవింద్ సుబ్రమణియన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో పాల్గొన్న ప్రొ. అరవింద్ సుబ్రమణియన్, తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించి, అనుసరించడం ద్వారా రాష్ట్రం గణనీయమైన ప్రగతిని సాధిస్తుందని ఆర్థిక వేత్త ప్రొ.అరవింద్ సుబ్రమణియన్ తెలిపారు.



## పీఎస్‌లో లొంగిపోయిన ప్రభాకర్ రావు

జూబ్లీహిల్స్/హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు శుక్రవారం సిట్ ఎదుట లొంగిపోయారు. ఉదయం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు వెళ్లిన ప్రభాకర్ రావు.. సిట్ అధికారుల ముందు హాజరయ్యారు. గురువారం సుప్రీంకోర్టులో ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా సిట్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ప్రభాకర్ రావు విచారణకు సహకరించడం లేదని, మొబైల్, ల్యాప్ టాప్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను మెమరీ మొత్తం డిలీట్ చేసి అప్పగించారని పేర్కొన్నారు. ఆయన నుంచి సమాచారం రాబట్టేందుకు ప్రభాకర్ రావును కస్టోడియల్ విచారణకు అప్పగించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన అత్యున్నత న్యాయస్థానం.. వారం రోజుల కస్టోడియల్ విచారణకు అనుమతినిచ్చింది. ఆ తర్వాత వచ్చే రిపోర్టుపై మళ్లీ విచారణ చేస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా ప్రభాకర్ రావుకు భౌతికంగా ఎలాంటి హాని జరగకుండా చూడాలని, చట్టప్రకారం దర్యాప్తు చేయాలని అధికారులకు సూచించింది.

## డ్రైనేజీలో బీఆర్ఎస్ ఓట్లు

**పోలీసులకు జగదీశ్ రెడ్డి ఫిర్యాదు**

**ఆర్వోను సస్పెండ్ చేసిన కలెక్టర్**

చిట్యాల (నల్లగొండ), డిసెంబర్ 12 (ఈవార్తలు): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని ఓ డ్రైనేజీ కాల్వలో పోలైన బ్యాలెట్ పేపర్ ఓట్లు లభ్యమయ్యాయి. అవన్నీ బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థికి చెందిన 'కత్తెర గుర్తు'కు ఓటువేసి ఉ న్నవే కావడంతో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలైన బ్యాలెట్ పేపర్ ఓట్స్ దొరికిన స్థలానికి చేరుకున్న జగదీశ్ రెడ్డి ఎన్నికల్లో అవకతవకలపై ఎన్నికల అధికారులకు, పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. గులాబీ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులు ఓడిపోయేలా కుతంత్రాలు చేసారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌పై ఫైరయ్యారు. ఇలానే చాలా గ్రామాల్లో రిగ్గింగ్ చేసి గెలిచారని కాంగ్రెస్ నాయకులపై విమర్శలు గుప్పించారు. బ్యాలెట్ ఓట్లు డ్రైనేజీలో కనిపించిన విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్టేజ్ -2 ఆర్వోను సస్పెండ్ చేశారు.

# టీజీ ప్రజలు మారుతారు

## బీఆర్ఎస్‌కు మళ్లీ అధికారమిస్తారు.. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్

**బీఆర్ఎస్ బౌన్స్ బ్యాక్ అవుతుంది**

**అఖిలేశ్ స్ఫూర్తితో అధికారంలోకి వస్తాం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎప్పుడు కలిసినా చాలా ఆప్యాయంగా, సొంత మనిషిలా అనిపిస్తుంది అని సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ ఎప్పుడు వచ్చినా కలుస్తానని...బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎప్పుడూ గౌరవంతో స్వాగతం పలికారని అన్నారు. రాజకీయాల్లో ఎప్పుడూ ఒడిదుడుకులు ఉ ంటూనే ఉంటాయని...రాజకీయాల్లో ప్రజలు ఒక్కోసారి స్వీకరిస్తారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సమావేశమయ్యారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వచ్చిన అఖిలేష్‌కు కేటీఆర్, హరీశ్‌రావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు పలు అంశాలపై చర్చించారు. తెలంగాణలో రాజకీయ పరిస్థితులు త్వరలో మారుతాయని...నిరంతరం ప్రజల వెంట ఉంటే బీఆర్ఎస్‌కు తిరిగి అవకాశం ఇస్తారని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ పక్షాన నిలబడతారని అఖిలేశ్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడితే, ప్రజలు తప్పకుండా అండగా ఉ ంటారని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసానికి వెళ్లిన అఖిలేష్ యాదవ్ కేటీఆర్‌తో భేటీ అయ్యారు. అనంతరం అఖలేష్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో జయాపజయాలు సహజమని, ఒక్కోసారి ప్రజలు మన పనితీరును, విధానాలను పునఃసమీక్షించుకునే అవకాశాన్ని ఓటమి ద్వారా కల్పిస్తారని చెప్పుకొచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో తమ పార్టీ ప్రస్థానాన్ని ఉదహరిస్తూ గతంలో తాము కూడా చాలా తక్కువ సీట్లు గెలిచామని, కానీ ప్రజలు తమ వెంటే నిలిచారని గుర్తు చేశారు. ప్రజల మద్దతుతోనే యూపీలో బీజేపీని రెండో స్థానానికి నెట్టి 37 మంది ఎంపీలతో లోక్‌సభలో బలంగా ఉన్నామని వ్యాఖ్యానించారు.ఖచ్చితంగా తెలంగాణలోనూ ప్రజల ఆలోచనలో మార్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. దేశంలో ప్రస్తుతం విభజన రాజకీయాలు నడుస్తున్నాయని, వాటికి స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని సమాజ్ వాదీపార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో ప్రతికూలత పోవాలని, అభివృద్ధి, సానుకూల దృక్పథంతో కూడిన ప్రగతిశీల రాజకీయాలు రావాలని ఆకాంక్షించారు. తాము అదే విజన్‌తో ముందుకు వెళ్తున్నామని అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు.

**అఖిలేష్ యాదవ్ మాకు స్ఫూర్తి: కేటీఆర్**

హైదరాబాద్ వచ్చిన అఖిలేష్ యాదవ్ హైదరాబాద్ వస్తున్నప్పుడు తాము స్వాగతం పలుకుతామంటే స్వయంగా వచ్చి కలుస్తానని, చర్చిస్తానని చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. త్వరలోనే అఖిలేష్ యాదవ్ కేసీఆర్‌తో సమావేశం అవుతారని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ఇంటికి వచ్చి తమ సమయం గడిపి ఆతిథ్యం స్వీకరించారని, తమతో సమయం గడిపినందుకు అఖిలేష్ యాదవ్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అఖిలేష్ యాదవ్ తమకు స్ఫూర్తి అని చెప్పుకొచ్చారు. గతంలో శాసనసభలో అధికారం కోల్పోయిన తర్వాత పార్లమెంట్‌లో తక్కువ సీట్లు సాధించినా అఖిలేష్ యాదవ్ వెనక్కి తగ్గలేదు అని చెప్పుకొచ్చారు. నిత్యం ప్రజల వెంబడి నిలిచారని అన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేసిన అఖిలేష్ యాదవ్ పార్టీ ఇప్పుడు 37 మంది ఎంపీలను గెలిపించుకొని దేశంలోని మూడవ అతిపెద్ద పార్టీగా నిలిచిందని అన్నారు. బీఆర్ఎస్ కూడా బౌన్స్ బ్యాక్ అవుతుందని...మళ్లీ అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాడుతూ... ప్రజల వెంట నిలబడి మరోసారి తప్పకుండా ప్రజల ఆశీర్వాదాలు పొందుతామని చెప్పారు. మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తామని తెలిపారు.

# ఆత్మహత్యలు వద్దు




హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): బీసీలకు రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేస్తామని, ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం చూపలేవని ఆయన అన్నారు. యువత ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. బీసీ రిజర్వేషన్లను సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఈశ్వరాచారి

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వినతి**

**పొన్నంతో కలిసి ఈశ్వరాచారి కుటుంబానికి పరామర్శ**

కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ ఛైర్మన్ డా.వినయ్, కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులు ఈశ్వరాచారి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతేకాకుండా, కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలులో అన్యాయం జరిగిందంటూ ఈశ్వరాచారి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న కార్యాలయం ముందు రహదారిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వరాచారిని గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు.



## గెస్ట్ ఫ్యాకల్టీపై లైంగిక దాడి

**హైదరాబాద్ జేఎన్టీయూలో ఘటన**

కూకట్‌పల్లి/హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీలో (జేఎన్టీయూ) దారుణ ఘటన వెలుగుచూసింది. తన వద్ద గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న మహిళపై ఓ ప్రొఫెసర్ లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందిత ప్రొఫెసర్‌ను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు బాధితురాలిని ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరింపులకు గురిచేశాడు. తామిద్దరం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారం అని నమ్మించి, పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పని పేరుతో అర్ధరాత్రి వరకు తనతోనే ఉ ంచుకోవడంతో బాధితురాలి వైవాహిక జీవితంలో కలతలు రేగాయి. దీంతో భర్తకు దూరంగా ఆమె ఒంటరిగా జీవించడం ప్రారంభించింది. బాధితురాలు ఒంటరిగా ఉండటాన్ని అవకాశంగా తీసుకున్న ప్రొఫెసర్, శారీరకంగా, మానసికంగా మరింత వేధించడం మొదలుపెట్టాడు. తన ఛాంబర్‌లోనే ఆమెపై అత్యాచారయత్నం చేసినట్లు కూడా బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. రోజురోజుకూ వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించింది. ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ ఘటనతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**దువ్వాడ అనుచరుడి బర్త్ డే పార్టీ**

## పోలీసుల ఎంట్రీతో సీన్ రివర్స్

మొయినాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మద్యం పార్టీపై స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... మొయినాబాద్‌లోని 'ది పెండెంట్' ఫామ్‌హౌస్‌లో దువ్వాడ శ్రీనివాస్ అనుచరుడు పార్థసారథి తన పుట్టినరోజు వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ పార్టీకి దువ్వాడ శ్రీనివాస్, మాధురి దంపతులు కూడా హాజరయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఫామ్‌హౌస్‌పై దాడి చేసిన పోలీసులు, అక్కడ అనుమతి లేకుండా మద్యం సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో 7 మద్యం బాటిళ్లను, హుక్కా పాట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పార్టీలో మొత్తం 29 మంది పాల్గొన్నట్లు సమాచారం. పార్టీ నిర్వహించినందుకు గాను పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

## ఎల్లుండి ఎస్పీబీ విగ్రహావిష్కరణ

రవీంద్రభారతి, డిసెంబర్ 12 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని రవీంద్ర భారతి ప్రాంగణంలో దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 15న జరగనుంది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరు కానున్నారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో బాలు విగ్రహం ఏర్పాటును కొందరు వ్యతిరేకించగా, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ వ్యతిరేకతను తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

## పెరిగిన చలి తీవ్రత

హైదరాబాద్, డిసెంబర్ 12 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల కారణంగా రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయని పేర్కొంది. ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాల్లో చలి గాలుల ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపింది. శనివారం శీతల, అతి శీతల పవనాలు వీచే అవకాశం ఉన్నందున ఉ త్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణ శాఖ అధికారి శ్రావణి తెలిపారు. రానున్న రోజుల్లో పొగమంచు పెరిగే అవకాశం ఉందని అన్నారు.



# జాతర నాటికి 'మేడారం' పూర్తి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**






మేడారం, డిసెంబర్ 12 (ఈవార్తలు): జనవరిలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేస్తున్నామని, జాతర నాటికి అన్ని పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సమ్మక్క- సారలమ్మ జాతర జనవరి నెలలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జాతర కోసం శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు మంత్రి సీతక్క ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం మంత్రి సీతక్కతో కలిసి పొంగులేటి దేవాలయ గద్దెల పునరుద్ధరణ అభివృద్ధి పనులను పరిశీలించారు. దేవాలయ ప్రాంగణంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్ పనులను, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ పనులను,జంపన్న వాగు వద్ద జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. తొలుత సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజలు చేశారు. ఆ తర్వాత మాట్లాడిన ఆయన.. మరో వందేళ్ల వరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసే విధంగా నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మేడారం దేవాలయం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఈ జాతరకు గిరిజనులు, గిరిజనేతరులు దాదాపు కోటి మందికి పైగా హాజరవుతారని, జాతర కోసం 50 కిలోమీటర్ల పరిధిలో భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మేడారం ప్రాంగణాన్ని మహా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.



# పత్తి మిల్లులో ఘోర అగ్నిప్రమాదం

**రూ.కోట్ల విలువైన కాటన్ దగ్ధం!**

కోనరావుపేట, డిసెంబర్ 12 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని కావేరి ఇండస్ట్రీస్ పత్తి మిల్లులో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామంలో ఉన్న కావేరి ఇండస్ట్రీస్ పత్తి మిల్లులో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరగ్గా.. ప్రాథమిక అంచనా ప్రకారం, పత్తి మిల్లులో నిల్వ ఉంచిన భారీ మొత్తంలో పత్తి ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుంది. క్షణాల్లో మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మిల్లు ఆవరణ అంతా దట్టమైన పొగ కమ్ముకుంది. ఈ అగ్ని ప్రమాదంలో రూ.కోట్ల విలువైన పత్తి దగ్ధమైనట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే మిల్లు సిబ్బంది, స్థానికులు అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించారు. అప్పటికే భారీ నష్టం జరిగినట్లు తెలిసింది.



## అయ్యప్ప స్వామి మహా పడిపూజలో విప్ ఆది

చందుర్తి, డిసెంబర్ 12 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కేంద్రంలో అయ్యప్ప సేవ సమితి వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 18 వ వార్షికోత్సవ అయ్యప్ప స్వామి మహా పూజ మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## 8 వేలు కాదు.. 25 వేలు

**ఉద్యోగాల పెంపునకు కాగ్నిజెంట్ ఓకే**

వైజాగ్, డిసెంబర్ 12 (ఈవార్తలు): పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన విశాఖపట్నం, ఇప్పుడు టెక్నాలజీ హబ్‌గా రూపుదిద్దుకుంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో బలమైన ఐటీ పర్యావరణ వ్యవస్థను (ఎకో సిస్టం) నిర్మిస్తున్నామని, అందులో భాగంగానే ప్రపంచ ప్రఖ్యాత ఐటీ సంస్థలు విశాఖకు తరలివస్తున్నాయని ఆయన తెలిపారు. శుక్రవారం నాడు విశాఖపట్నంలోని కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమక్షంలో కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ కీలక ప్రకటన చేశారు. తమ సంస్థ ద్వారా విశాఖలో 25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగ్నిజెంట్ సంస్థ మొత్తం రూ.1,583 కోట్ల పెట్టుబడితో ఈ అత్యాధునిక క్యాంపస్‌ను నిర్మించనుంది. 2033 నాటికి మూడు దశల్లో నిర్మాణం పూర్తి కానుండగా, మొదటి దశను 2026 నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు. అప్పటివరకు తాత్కాలిక కార్యాలయంలో కార్యకలాపాలు కొనసాగుతాయి. ఈ క్యాంపస్‌లో ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి సారించనున్నారు.

## బాపట్ల జిల్లాలో ముగ్గురి దుర్మరణం

బాపట్ల, డిసెంబర్ 12 (ఈవార్తలు): ఏపీలోని బాపట్ల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కొల్లూరు మండలం దోనేపూడి వద్ద కొబ్బరికాయల లోడుతో వెళుతున్న ఓ ఆటో అదుపుతప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కొల్లూరు నుంచి వెల్లటూరు వైపు వెళ్తున్న ఆటో, దోనేపూడి వద్దకు రాగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఆటో నేరుగా రోడ్డు పక్కనే ఉన్న పంట కాల్వలోకి దూసుకెళ్లింది.

# 9 జిల్లాలతో వీఈఆర్

**ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి**




వైజాగ్, డిసెంబర్ 12 (ఈవార్తలు): తొమ్మిది జిల్లాలతో కూడిన విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) ను ప్రపంచస్థాయి ఆర్థిక కేంద్రంగా (గ్లోబల్ ఎకనమిక్ హబ్) తీర్చిదిద్దేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 2032 నాటికి ఈ ప్రాంతాన్ని 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని, తద్వారా 30 లక్షల ఉద్యోగాలు సృష్టించాలని లక్ష్యంగా నిర్దేశించారు. వీఈఆర్ అభివృద్ధిపై శుక్రవారం విశాఖలో మంత్రులు, 9 జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన తొలిసారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీఈఆర్‌కు సంబంధించిన 49 ప్రాజెక్టులపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. 7 గ్రోత్ డ్రైవర్లు, 10 పాలసీలతో ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "విశాఖను మురికివాడలు లేని నగరంగా తీర్చిదిద్దాలి. భూసేకరణ ప్రక్రియ వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా జరగాలి. రాష్ట్రంలో విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు ప్రధాన ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తాం" అని చంద్రబాబు అన్నారు. సమర్థంగా మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే 2047 నాటికి వీఈఆర్ ఆర్థిక వ్యవస్థ 800 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతులు వంటి అన్ని రంగాల్లో వీఈఆర్ అభివృద్ధి చెందాలని సూచించారు. అనకాపల్లిలో త్వరలోనే మెడ్‌టెక్ జోన్-2 ఏర్పాటు చేస్తామని, టాయ్స్ పార్క్‌లో పరిశ్రమలు పెట్టేవారికి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఐటీ, ఏఐ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరానికి మించి డేటా సెంటర్లను ప్రోత్సహించవద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో అనుసంధానించాలని, రహదారుల విస్తరణపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలని, రైతులు లాభసాటి పంటల వైపు మళ్లేలా చూడాలని సూచించారు. కైలాసగిరి నుంచి భీమిలి వరకు ఉన్న తీర ప్రాంతాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని చెప్పారు. వీఈఆర్ అభివృద్ధి పనులపై ప్రతి రెండు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

# పొందూరు ఖాదీకి జీఐ ట్యాగ్ గుర్తింపు

పొందూరు (శ్రీకాకుళం), డిసెంబర్ 12 (ఈవార్తలు): శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత పొందూరు ఖాదీకి ప్రతిష్ఠాత్మక భౌగోళిక సూచిక (జీఐ ట్యాగ్) లభించింది. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఒక శ్రీకాకుళం వాసిగా గర్విస్తున్నానని పేర్కొన్నారు. "శ్రీకాకుళం వాసి గా నాకు ఎంతో గర్వించదగ్గ క్షణం ఇది. ఎన్నో సంవత్సరాల నిరీక్షణ అవిశ్రాంత కృషి, లెక్కలేనన్ని సమావేశాలు, డాక్యుమెంటేషన్, ఫాలోఅప్‌ల తర్వాత, పొందూరు ఖాదీకి ప్రతిష్ఠాత్మకమైన జీఐ ట్యాగ్ లభించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది కేవలం ఒక వస్త్రానికి వచ్చిన గుర్తింపు మాత్రమే కాదు... శ్రీకాకుళం చేనేత కార్మికుల వారసత్వానికి లభించిన గౌరవం. మన శ్రీకాకుళం గర్వం ఇప్పుడు నేడు దేశానికే గర్వకారణం. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించిన, మహాత్మా గాంధీ గారికి ప్రియమైన పొందూరు ఖాదీ ప్రతి నూలు పోగులో తరాల చరిత్రను మోస్తుంది. ఎన్నో కష్టాలు వచ్చినా మన నేత కార్మికులు తమ కళను వదల్లేదు. వారి ఓర్పు, నైపుణ్యం, నమ్మకం ఈ సంప్రదాయాన్ని సజీవంగా ఉంచాయి. వారి చేతులు కేవలం వస్త్రాన్ని మాత్రమే కాదు ఒక గుర్తింపును నేసాయి. ఈ జీఐ ట్యాగ్ సాధనలో అండగా నిలిచిన ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. తరతరాలుగా ఈ కళను కాపాడిన మన నేత కార్మికులకు ఈ గౌరవం అంకితం. ఈ జీఐ ట్యాగ్ వారి గుర్తింపును మరింత బలోపేతం చేస్తుంది, వారి జీవనోపాధిని మెరుగుపరుస్తుంది, పొందూరు ఖాదీకి ప్రపంచ స్థాయిలో కొత్త వైభవం తెస్తుంది" అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# పచ్చకామెర్ల లెక్క మోదీ తీరు: షర్మిల



విజయవాడ, డిసెంబర్ 12 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏపీలో కూటమి పాలన బాగుందని ప్రధాని చెప్పడం చూస్తుంటే, పచ్చకామెర్లు సోకిన వ్యక్తికి లోకమంతా పచ్చగా కనిపించినట్లుందని ఆమె ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, రోగులు పడుతున్న కష్టాలు ప్రధాని మోదీకి కనిపించడం లేదా అని ఆమె ప్రశ్నించారు. ఈ మేరకు షర్మిల ఒక ప్రకటన విడుదల చేశారు. "గిట్టుబాటు ధర లేక రైతులు పంటలను తగలబెడుతున్నా, తుపానులతో సర్వం కోల్పోయినా ప్రభుత్వం ఆదుకోలేని నిర్లక్ష్యం ప్రధానికి కనిపించదు. వెల్ఫేర్ హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక వారి కష్టాలు, ఆరోగ్యశ్రీ నిలిచిపోవడంతో రోగుల వేదన ఆయన దృష్టికి రావడం లేదు" అని ఆమె పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, హామీల అమలులో కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కులను, విభజన హామీలను కూటమి పార్టీలు ప్రధాని కాళ్ల దగ్గర తాకట్టు పెట్టాయని షర్మిల దుయ్యబట్టారు. "వాళ్లు తల ఊపమంటే ఊపే గొర్రెల్లా మారారు కాబట్టే, మోదీకి కూటమి పాలన భేష్ అనిపిస్తోంది. ప్రధాని హోదాలో ఉండి అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన నిజాలు దాగవు" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానిది అసమర్థ పాలన అని, ఆర్భాటాలు తప్ప ఆచరణలో హామీల అమలు శూన్యమని షర్మిల విమర్శించారు. రాష్ట్రంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, విభజన హామీలు అమలు చేసి, ప్రత్యేక హోదా ఇవ్వాలని, అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించాలని షర్మిల డిమాండ్ చేశారు.

# రైతులకు అండగా టెక్కీ

అభినందించిన నాదెండ్ల

పార్వతీపురం జిల్లా, డిసెంబర్ 12 (ఈవార్తలు): ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మరడాన శంకరరావును రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేకంగా అభినందించారు. శంకరరావుకు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడిన మంత్రి, ఆయన రైతులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. కష్టకాలంలో అన్నదాతలకు అండగా నిలవడం అభినందనీయమని ప్రశంసించారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శంకరరావు, తన స్వగ్రామమైన వీరఘట్టం మండలం కడకెల్లలోని రైతులు పడుతున్న ఇబ్బందులను 2019లో గమనించారు. ధాన్యం అమ్ముకోవడంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలను ఆయన అధ్యయనం చేశారు. సకాలంలో గోనె సంచులు దొరకకపోవడం, వాహనాలు రాకపోవడం, కొనుగోళ్లలో జాప్యం వంటి కారణాలతో రైతులు దళారులను ఆశ్రయిస్తూ నష్టపోవడాన్ని చూశారు. ఈ క్రమంలో రైతులకు అండగా నిలవాలని నిర్ణయించుకున్న శంకరరావు, తన సొంత డబ్బులతో వారికి గోనె సంచులు అందించడం, ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి వాహనాలను ఏర్పాటు చేయడం వంటివి చేస్తున్నారు. అలాగే అవసరమైన రైతులకు సుమారు లక్ష రూపాయల వరకు వడ్డీ లేని పెట్టుబడి సాయం కూడా అందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ధాన్యం డబ్బులు అందిన తర్వాత రైతులు ఆ మొత్తాన్ని తిరిగి శంకరరావుకు చెల్లిస్తున్నారు. రైతుల పట్ల శంకరరావు చూపిస్తున్న చొరవ, అందిస్తున్న సేవలను తెలుసుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్ ఆయనను అభినందించారు. మంత్రి ప్రశంసకు శంకరరావు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై చంద్రబాబు ఏరియల్ సర్వే

వైజాగ్, డిసెంబర్ 12 (ఈవార్తలు): ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన పలు ప్రాజెక్టుల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పరిశీలించారు. శుక్రవారం ఆయన హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించి, పనుల పురోగతిని గగనతలం నుంచి వీక్షించారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ముఖ్యమైన ఈ ప్రాజెక్టులను వేగవంతం చేయాలనే లక్ష్యంతో ఈ పర్యటన సాగింది. విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలో నిర్మితమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, రాయ్‌పూర్-విశాఖ జాతీయ రహదారి, తీరప్రాంత రోడ్లు, పోర్టులు, ఐటీ కంపెనీల నిర్మాణాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హెలికాప్టర్ నుంచే ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కనెక్టివిటీ ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఉత్తరాంధ్ర స్వరూపమే మారిపోతుందని, అభివృద్ధిలో కొత్త శకం ప్రారంభమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పనుల పురోగతిపై అధికారులతో చర్చించి, వారికి పలు సూచనలు చేసినట్లు సమాచారం.

## మరోసారి ఢిల్లీ పర్యటనకు చంద్రబాబు

అమరావతి, డిసెంబర్ 12 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి ఢిల్లీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఆయన హస్తినలో పర్యటించి, రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరపనున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా సాగే ఈ పర్యటనకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. షెడ్యూల్ ప్రకారం, డిసెంబర్ 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళతారు.

## ఆపదలో జీవన్ రెడ్డి అభయహస్తం



జగిత్యాల టౌన్, డిసెంబర్ 12 (ఈవార్తలు): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జగిత్యాల జిల్లా పొలాసకు చెందిన ఓ బాధితుడికి మాజీమంత్రి జీవన్ రెడ్డి రూ.4 లక్షల ఎల్వోసీ అందజేశారు. శుక్రవారం ఇందిరాభవన్‌లో బాధితుడు కాసారపు కొమరెల్లికి ఎల్వోసీ అందించి, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



## ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

**జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ వెల్లడి**

జగిత్యాల టౌన్, డిసెంబర్ 12 (ఈవార్తలు): రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ర్యాండమైజేషన్ విధానంలో ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి చేసినట్లు జగిత్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ బీ రాజ గౌడ్, ఇతర అధికారులతోతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ర్యాండమైజేషన్ లో పోలింగ్ అధికారులు1531 (పీవో- ప్రిసైడింగ్ ఆఫీసర్స్ ), ఇతర పోలింగ్ అధికారులు 2031 (ఏపివో )లను కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికలు నిర్వహించే 7 మండలాల్లో బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

## నా జీవితం ప్రజాసేవకే అంకితం

**రాజారం సర్పంచ్ అభ్యర్థి ఎడపల్లి అశోక్**



మల్యాల, డిసెంబర్ 12 (ఈవార్తలు): ప్రజలకు సేవ చేయడమే తన జీవితాశయమని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం, గ్రామ అభివృద్ధికి ప్రజల మనిషిగా సేవ చేస్తానని జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారం గ్రామ సర్పంచి అభ్యర్థి ఎడపెల్లి అశోక్ తెలిపారు. 25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, అన్ని వర్గాల అభ్యున్నతే తన లక్ష్యం అని వెల్లడించారు. ప్రజలు తనను ఆశీర్వదిస్తారన్న నమ్మకంతో ఉన్నానని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను గెలిపిస్తే గ్రామంలో రాజారంలో గుట్టపై వెలసిన శ్రీరామస్వామి గుడికి మెట్ల నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న మహిళా సంఘం భవన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని, అలాగే చెరువు గట్టుమీద పోచమ్మ ఆలయం కట్టిస్తానని హామీ ఇచ్చారు. రాజారం గ్రామాన్ని గొప్పగా తీర్చిదిద్దడానికి తనకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు.



## గుడిపేటను ఆదర్శ గ్రామం చేస్తా

**సర్పంచ్ అభ్యర్థి ఇట్టి రెడ్డి శ్వేత-అంజిరెడ్డి**

మల్యాల, డిసెంబర్ 12 (ఈవార్తలు): గ్రామ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తానని, ప్రజలు తనను ఆశీర్వదించాలని మల్యాల మండలం గుడిపేట సర్పంచ్ అభ్యర్థి ఇట్టిరెడ్డి శ్వేత అంజిరెడ్డి కోరారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో గ్రామానికి అధిక నిధులు తెప్పించి అంగన్వాడీ భవనం, రేషన్ దుకాణం, మంచినీటి సరఫరా, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధిలైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గుడిపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కాగా, అభ్యర్థి భర్త అంజిరెడ్డి గతంలో సింగిల్ విండో డైరెక్టర్‌గా పనిచేశారు. శ్వేత మహిళా సంఘం అధ్యక్షురాలిగా మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారు. ఇద్దరూ విద్యావంతులే.



# దివ్యాంగులకు అండగా కేంద్రం

**దేశంలో దివ్యాంగులు(2011 జనాభా లెక్కల ప్రకారం)**

మహిళలు - 1.18 కోట్లు.. పురుషులు - 1.50 కోట్లు

మొత్తం - 2.68 కోట్లు

మొత్తం జనాభాలో దివ్యాంగులు - 2.21 శాతం

## దివ్యాంగుల హక్కుల చట్టం-2016తో ప్రాధాన్యం.. సంక్షేమం, సహాయం కోసం అనేక పథకాలు

### అందుబాటులోకి ప్రత్యేక యాప్‌లు, పోర్టల్‌లు

న్యూఢిల్లీ: దేశంలోని దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దివ్యాంగుల ఎదుగుదలకు వైకల్యం అడ్డంకిగా ఉండొద్దనే ఆలోచనతో అనేక చర్యలు తీసుకుంటోంది. దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తూనే, వారికి సహాయకంగా ఉండే వ్యవస్థలను ఏర్పాటు చేస్తోంది. ముఖ్యంగా దివ్యాంగుల సహాయానికి సాంకేతికతను సమర్థం వినియోగిస్తోంది. తమ స్వశక్తితో ఎదిగేందుకు అవకాశాలు కల్పిస్తోంది. దివ్యాంగులకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పించే చట్టాలు, విధానాలను సమర్థంగా అమలు చేస్తోంది.



### దివ్యాంగుల హక్కుల చట్టాలు, విధానాలు

- దివ్యాంగుల హక్కుల చట్టం-2016: గతంలో ఉన్న దివ్యాంగుల చట్టం-1995 స్థానంలో తీసుకువచ్చిన ఈ కొత్త చట్టం 2017 ఏప్రిల్ 19 నుంచి అమలవుతోంది. 21 రకాల వైకల్యాలను ఈ చట్టం గుర్తించడంతో పాటు విద్యా, ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్‌ను తప్పనిసరి చేసింది.
- నేషనల్ ట్రస్ట్ ఫర్ ది వెల్ఫేర్ ఆఫ్ పర్సన్స్ విత్ ఆటిజం, సెరెబ్రల్ పాల్సీ, మెంటల్ రిటార్డేషన్ అండ్ మల్టిపుల్ డిజబిలిటీస్ యాక్ట్-1999: ఆటిజం, సెరెబ్రల్ పాల్సీ, మెంటల్ రిటార్డేషన్, బహుళ వైకల్యాలు కలిగిన వ్యక్తుల సంక్షేమం కోసం ప్రత్యేక జాతీయ సంస్థను ఈ చట్టం ఏర్పాటు చేసింది.
- రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) చట్టం-1992: దివ్యాంగుల రిహాబిలిటేషన్, ప్రత్యేక విద్య రంగంలో ఉన్న నిపుణుల శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణ, నియంత్రణ, సిలబస్ ప్రమాణీకరణ, సెంట్రల్ రిహాబిలిటేషన్ రిజిస్టర్ నిర్వహణను ఈ చట్టం తప్పనిసరి చేసింది.

### ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు:

దివ్యాంగుల హక్కుల చట్టం-2016 అమలు పథకం(ఎస్ఐపీడీఏ): దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, అవగాహన, సౌకర్యాల కోసం దివ్యాంగుల హక్కుల చట్టం కింద కార్యక్రమాలు అమలు చేయడానికి కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాలకు ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని అందించే కార్యక్రమం.

**సుగమ్య భారత్ అభియాన్(యాక్సెసబుల్ ఇండియా క్యాంపెయిన్):** దివ్యాంగులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న అడ్డంకులను ఎదుర్కొనేందుకు 2015 డిసెంబర్ 3న కేంద్రం సుగమ్య భారత్ అభియాన్ కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించింది. దివ్యాంగులకు అనుకూల మౌలిక సదుపాయాల నిర్మాణం, రవాణా వ్యవస్థల ఏర్పాటు, సమాచార, సంభాషణ సాంకేతికత(ఐసీటీ) ఏర్పాటుపై ఈ కార్యక్రమం దృష్టి సారిస్తోంది.

**ఏడీఐపీ పథకం:** దివ్యాంగుల శారీరక, సామాజిక, ఆర్థిక సహాయం కోసం 1981లో ఈ పథకం ప్రారంభమైంది. ఈ పథకం కింద దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందించడంతో పాటు అవసరమైతే సర్జరీలు చేస్తారు.

**దీన్‌దయాల్ దివ్యాంగుల పునరావాస పథకం(డీడీఆర్ఎస్):** దివ్యాంగుల విద్య, శిక్షణ, పునరావాసం కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ఈ పథకం కింద కేంద్రఆర్థిక సహాయాన్ని అందిస్తుంది.

జాతీయ దివ్యాంగుల ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్(ఎన్‌డీఎఫ్‌డీసీ): దివ్యాంగుల ఆర్థిక సాధికారత కోసం పని చేసే లాభాపేక్ష లేని సంస్థ. రాష్ట్రస్థాయి సంస్థలు, గ్రామీణ బ్యాంకుల సహకారంతో దివ్యాంగులకు స్వయం ఉపాధి, ఆదాయ కల్పన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రధానంగా దివ్యాంగ్జన్ స్వావలంబన్ యోజనం, విశేష్ మైక్రోఫైనాన్స్ యోజన పథకాల కింద రుణాలు మంజూరు చేస్తోంది.

### దివ్యాంగుల చికిత్స సంస్థలు

వినికిడి, ప్రసంగ వైకల్యం ఉన్న చికిత్స కోసం దేశవ్యాప్తంగా తొమ్మిది జాతీయ సంస్థలు ఉన్నాయి. సికింద్రాబాద్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ) కూడా ఇకటి. దీంతో పాటు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 30 కాంపోజిత్ రీజినల్ సెంటర్లు(సీఆర్సీ)లు కూడా పనిచేస్తున్నాయి.

### సాంకేతికతతో మరింత సహాయం

దివ్యాంగులకు విశిష్ట గుర్తింపు సంఖ్య: దివ్యాంగులకు కేంద్రం విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తోంది. ఇందుకోసం కేంద్రీకృత వెబ్ అప్లికేషన్ సైతం అందుబాటులో ఉంది. ఇందులో దివ్యాంగులు విశిష్ట ఐడీ(యూడీఐడీ) కార్డు, వైకల్య ధ్రువీకరణ పత్రం పొందవచ్చు. ఈ కార్డు ద్వారా దివ్యాంగులు పథకాలు, ప్రత్యేక సౌకర్యాలు అందుకోవడం సులువు అవుతోంది.

పీఎం-దక్ష్ పోర్టల్: దివ్యాంగులు, శిక్షణ సంస్థలు, ఉపాధి కల్పించే వారిని ఏకతాటి పైకి తీసుకువచ్చేందుకు కేంద్రం పీఎం-దక్ష్ అనే డిజిటల్ పోర్టల్ ప్రారంభించింది. దివ్యాంగుల నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కోసం దివ్యాంగన్ కౌశల్ వికాస్, దివ్యాంగన్ రోజ్‌గార్ సేతు కార్యక్రమాల అమలులో ఈ పోర్టల్ కీలకంగా పనిచేస్తుంది.

సుగమ్య భారత్ యాప్: దివ్యాంగులకు అవసరమైన సేవలు, సహాయం అందించేందుకు బహుభాషల్లో ఈ యాప్‌ను కేంద్రం రూపొందించింది. సంభాషణ ద్వారానూ ఈ యాప్ పనిచేస్తుంది. దివ్యాంగుల కోసం ఐఈఎల్‌టీఐఎస్ శిక్షణ హ్యాండ్‌బుక్ కూడా రూపొందించింది.

ప్రశస్త యాప్: పాఠశాల విద్యార్థుల్లో వైకల్యాలను త్వరగా గుర్తించి, చికిత్స అందించేందుకు కేంద్రం ప్రశస్త యాప్‌ను తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 92 లక్షల మంది విద్యార్థులకు వైకల్యాన్ని గుర్తించేందుకు ప్రాథమిక స్థాయి పరీక్షలు నిర్వహించారు.

### ఇండియన్ సైన్ లాంగ్వేజ్(ఐఎస్ఎల్)కు ప్రోత్సాహం

దివ్యాంగుల కోసం సంజ్ఞల భాషను మరింత అభివృద్ధి చేసేందుకు, ప్రోత్సహించేందుకు 2015లో కేంద్రంఇండియన్ సైన్ ల్యాంగ్వేజ్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేసింది. అమెరికన్ సైన్ లాంగ్వేజ్(ఏఎస్ఎల్), బ్రిటీష్ సైన్ లాంగ్వేజ్(బీఎస్ఎల్)పై ఈ ప్రాథమిక శిక్షణ ఇస్తారు. ఇండియన్ సైన్ లాంగ్వేజ్(ఐఎస్ఎల్) అభివృద్ధికి ఈ సంస్థ పనిచేస్తోంది. కేంద్రం 2024 డిసెంబర్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా డీటీహెచ్‌లో పీఎం ఈ-విద్య చానెల్ 31 ప్రారంభించింది. 3,189 ఐఎస్ఎల్ వీడియోలను సైతం అందుబాటులోకి తీసుకువచ్చింది.

---

## ఇండిగోకు రూ.58 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: ప్రముఖ బడ్జెట్ విమానయాన సంస్థ ఇండిగో తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. కొద్ది రోజులుగా వందల కొద్దీ విమానాలను రద్దు చేస్తూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ సంస్థపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇదే సమయంలో కంపెనీకి రూ.58.75 కోట్ల జీఎస్టీ జరిమానా విధిస్తూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వెల్లడించింది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఢిల్లీ సౌత్ కమిషనరేట్‌కు చెందిన సీజీఎస్టీ అదనపు కమిషనర్ కార్యాలయం నుంచి నిన్న ఈ ఆర్డర్ అందినట్లు తెలిపింది. మరోవైపు ఇండిగోలో నెలకొన్న గందరగోళంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇండిగో భద్రత, కార్యాచరణ ప్రమాణాలను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు ఫ్లైట్ ఇన్‌స్పెక్టర్లను విధుల నుంచి తొలగించింది. అటు పరిస్థితిని చక్కదిద్దేందుకు డీజీసీఏ రంగంలోకి దిగింది. ఇండిగో కార్యకలాపాలను నిశితంగా పరిశీలించేందుకు రెండు ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను గురుగ్రామ్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు డీజీసీఏకు నివేదిక సమర్పిస్తాయి. ఒక బృందం విమానాల సంఖ్య, పైలట్ల లభ్యత, సిబ్బంది పనిగంటలు, శిక్షణ షెడ్యూళ్లు వంటి కార్యాచరణ అంశాలను పరిశీలిస్తుండగా, మరో బృందం ప్రయాణికులపై ప్రభావం, రిఫండ్‌ల స్థితి, సామాను తిరిగి ఇవ్వడం వంటి అంశాలపై దృష్టి సారిస్తుంది.

## భారత్‌తో కలిసి ట్రంప్ 'సీ5'?

**శక్తివంతమైన 'కోర్ ఫైవ్' ఏర్పాటు యోచన**

**రష్యా, చైనా, జపాన్‌కూ చోటు కల్పించే యత్నాలు**


న్యూఢిల్లీ:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ రాజకీయాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యూరప్ ఆధిపత్యంలో ఉన్న జీ7 కూటమిని పక్కనపెట్టి, దాని స్థానంలో 'సీ5' (కోర్ ఫైవ్) పేరుతో ఓ కొత్త శక్తివంతమైన కూటమిని ఏర్పాటు చేయాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఈ కూటమిలో అమెరికా, రష్యా, చైనా, జపాన్‌తో పాటు భారత్‌కు కూడా కీలక స్థానం కల్పించాలని యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అమెరికన్ మీడియా సంస్థ 'పొలిటికో' ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. గతవారం వైట్‌హౌస్ విడుదల చేసిన జాతీయ భద్రతా వ్యూహానికి సంబంధించిన ప్రచురించని రహస్య పత్రంలో ఈ 'సీ5' ప్రతిపాదన ఉన్నట్లు ఆ కథనం పేర్కొంది. సంపద, ప్రజాస్వామ్య పాలన వంటి జీ7 నిబంధనలతో సంబంధం లేకుండా, ప్రపంచంలోని ప్రధాన సైనిక, ఆర్థిక, జనాభా శక్తిగా ఉన్న దేశాలతో ఈ కొత్త కూటమిని ఏర్పాటు చేయాలన్నది దీని వెనుక ఉన్న ఆలోచన. అయితే, ఈ రహస్య పత్రం ఉందన్న వార్తలను వైట్‌హౌస్ ఖండించింది. అలాంటి ప్రత్యామ్నాయ పత్రమేదీ లేదని ప్రెస్ సెక్రటరీ హన్నా కెల్లీ స్పష్టం చేశారు.

## విమాన చార్జీల మోతను అడ్డుకోలేరా?

**కేంద్రమంత్రి రామ్మోహన్‌కు ప్రశ్నలవర్షం**

**ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని వివరణ**

న్యూఢిల్లీ: విమానయాన రంగంలో టిక్కెట్ ఛార్జీల పెరుగుదలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు. ఈ రంగంలో ఏడాది పొడవునా టిక్కెట్ ఛార్జీలపై పరిమితి విధించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో విమాన టిక్కెట్ ధరలను నియంత్రించాలంటూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రైవేటు మెంబర్ బిల్లుపై ఆయన మాట్లాడారు. టిక్కెట్ ధరల డీ-రెగ్యులేషన్ వల్ల పౌరవిమానయాన రంగం వృద్ధి చెందుతుందని, వినియోగదారులకు కూడా ప్రయోజనకరమని అన్నారు. అప్పుడే కొత్త సంస్థలు ఈ రంగంలోకి ప్రవేశించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. పండుగల సీజన్‌లో మాత్రం టిక్కెట్ ధరలు పెరగడం సహజమే అన్నారు. అలాగని ఆయా సంస్థలు ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచుకుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. అవసరమైనప్పుడు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని అన్నారు. కంపెనీలు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తే కేంద్రం జోక్యం చేసుకున్న సందర్భాలు ఉన్నాయని అన్నారు. కరోనా, కుంభమేళా, పహల్గామ్ ఉగ్రదాడి వంటి సమయాల్లో విమాన టిక్కెట్ ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుందని గుర్తు చేశారు. కేంద్రం తన ప్రత్యేక అధికారాలను వినియోగించి టిక్కెట్ ధరలను అదుపు చేసిందని అన్నారు. ఇండిగో సంక్షోభ సమయంలోనూ టిక్కెట్ ధరలను నియంత్రించినట్లు సభకు తెలిపారు. ఈశాన్య, దక్షిణాదిలోని 25 మార్గాల్లో టిక్కెట్ల ధరలను స్థిరంగా ఉంచేందుకు 'ఫేర్ సే ఫుర్సత్' పథకాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. ఏవియేషన్ ఎకో సిస్టం అభివృద్ధికి దీర్ఘకాలిక దృష్టితో ప్రభుత్వం చూడాల్సి ఉంటుందని అన్నారు. ఛార్జీలపై పరిమితి ఒక్కటే పరిష్కారం కాదని ఆయన అన్నారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే టిక్కెట్ ధరలు తగ్గుముఖం పట్టాయని అన్నారు.



## బరువు తగ్గించే ఒజెంపిక్ ఇంజెక్షన్

**భారత్‌లోకి ఎంట్రీ.. నెలకు రూ.8,800**



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా బరువు తగ్గించే ఔషధంగా సంచలనం సృష్టించిన 'ఒజెంపిక్' ఇంజెక్షన్ ఇప్పుడు భారత్‌లోనూ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ ఫార్మా సంస్థ నోవో నార్డిస్క్ ఈరోజు ఈ ఔషధాన్ని దేశీయ మార్కెట్‌లో విడుదల చేసింది. టైప్ 2 మధుమేహం నియంత్రణ కోసం అధికారికంగా అనుమతి పొందిన ఈ డ్రగ్‌కు, బరువు తగ్గించే గుణం ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ నెలకొంది. దీని నెల రోజుల డోసు ప్రారంభ ధర రూ. 8,800గా ఉంది. ఒజెంపిక్ (సెమాగ్లుటైడ్) అనేది వారానికి ఒకసారి తీసుకునే ఇంజెక్షన్. ఇది 0.25ఎంజీ, 0.5ఎంజీ, 1ఎంజీ డోసుల్లో లభిస్తుంది. నొప్పి లేకుండా సులభంగా ఇంజెక్ట్ చేసుకునేందుకు వీలుగా 'నోవోఫైన్ నీడిల్స్' అనే ప్రీ-ఫిల్డ్ పెన్ రూపంలో దీన్ని అందిస్తున్నారు. ప్రారంభ డోస్ అయిన 0.25ఎంజీ పెన్ ధర రూ. 8,800 కాగా, 0.5ఎంజీ ధర రూ. 10,170, 1ఎంజీ ధర రూ. 11,175గా కంపెనీ నిర్ణయించింది. ప్రతి పెన్‌లో నాలుగు వారాలకు సరిపడా డోసులు ఉంటాయి. ఈ సందర్భంగా నోవో నార్డిస్క్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విక్రాంత్ శ్రోత్రియా మాట్లాడుతూ... "ఒజెంపిక్‌ను భారత్‌కు తీసుకురావడం ఒక ముఖ్యమైన మైలురాయి. ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైన క్లినికల్ ఫలితాలతో వస్తున్న ఈ ఔషధం భారతీయ వైద్యులకు ఒక సమర్థవంతమైన చికిత్సా మార్గాన్ని అందిస్తుంది. సులభంగా వాడే పెన్ ద్వారా మెరుగైన గ్లూకోజ్ నియంత్రణ, బరువు నియంత్రణ, గుండె, కిడ్నీలకు దీర్ఘకాలిక రక్షణ అందించడమే మా లక్ష్యం" అని వివరించారు. అమెరికా ఎఫ్‌డీఏ 2017లో టైప్ 2 డయాబెటిస్ కోసం ఒజెంపిక్‌కు ఆమోదం తెలిపింది. అయితే, ఇది ఆకలిని నియంత్రించగలగడంతో బరువు తగ్గడం కోసం దీని వాడకం విపరీతంగా పెరిగింది. ఇది జీఎల్‌పీ-1 రిసెప్టార్ అగోనిస్ట్‌గా పనిచేస్తూ, మెదడులోని ఆకలి కేంద్రాలపై ప్రభావం చూపుతుంది. మధుమేహంతో సంబంధం ఉన్న గుండె, కిడ్నీ సంబంధిత సమస్యల ముప్పును కూడా తగ్గిస్తుందని నోవో నార్డిస్క్ పేర్కొంది.

## దూసుకెళ్లిన సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, ముఖ్యంగా మెటల్ స్టాక్స్‌లో భారీ కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభపడ్డాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 449.53 పాయింట్లు పెరిగి 85,267.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 148.40 పాయింట్లు లాభపడి 26,046.95 వద్ద ముగిసింది. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం జరిగిన చర్చలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఇరు దేశాలు వాణిజ్య ఒప్పందం దిశగా ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ పరిణామం సానుకూల ప్రభావం చూపింది. నిఫ్టీలో టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్%డ%టీ, మారుతీ సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అయితే, లాభాల స్వీకరణతో హెచ్‌యూఎల్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, పవర్ గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్ వంటివి నష్టపోయాయి. సెక్టార్ల వారీగా చూస్తే, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 2.63 శాతం పెరిగి ర్యాలీకి నాయకత్వం వహించింది. రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు కూడా లాభపడగా.. ఎఫ్ఎంసీజీ, మీడియా రంగాలు నష్టాల్లో ముగిశాయి. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.18 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.94 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ 25,900 స్థాయిని కీలక మద్దతుగా నిలుపుకున్నంత కాలం సమీప భవిష్యత్తులో సానుకూల ధోరణి కొనసాగవచ్చని, స్వల్పకాలంలో 26,300 స్థాయికి చేరే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, దేశీయ మార్కెట్లో వెండి ధరల జోరు కొనసాగుతోంది. శుక్రవారం వెండి ఫ్యూచర్స్ చరిత్రలో తొలిసారిగా కేజీ రూ.2 లక్షల మార్కును దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి ధర దాదాపు 130 శాతం పెరగడం గమనార్హం.

## 'ఇండిగో' దర్యాప్తు కోసం కన్సల్టెన్సీ

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థ ఇండిగో తమ సర్వీసుల్లో ఇటీవల తలెత్తిన కార్యాచరణ అంతరాయాలపై దర్యాప్తునకు ఓ స్వతంత్ర ఏవియేషన్ కన్సల్టెన్సీని నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఏవియేషన్ రంగ నిపుణుడు కెప్టెన్ జాన్ ఇల్సన్ నేతృత్వంలోని 'చీఫ్ ఏవియేషన్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌సి' ఈ విచారణ చేపట్టనుంది. ఇటీవల ఇండిగో విమానాలు తీవ్ర అంతరాయాలకు గురైన నేపథ్యంలో, సమస్యకు గల కారణాలను క్షుణ్ణంగా విశ్లేషించేందుకు ఈ నియామకం చేపట్టినట్టు సంస్థ తెలిపింది. ఈ నియామకానికి ఇండిగో బోర్డు ఆమోదం తెలిపిందని ప్రకటనలో పేర్కొంది.

## భూకంపాల నివారణ కోర్టు పనా?: సుప్రీం

న్యూఢిల్లీ: భూకంపాల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తూ, "అయితే ఇప్పుడు ప్రతి ఒక్కరినీ చంద్రుడిపైకి తరలించాలా? అయినా భూకంపాల నివారణ కోర్టు పనా?" అని ఘాటుగా వ్యాఖ్యానించింది. భారత్‌లో సుమారు 75 శాతం మంది ప్రజలు భూకంపాలు సంభవించే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నారని, వారి భద్రత కోసం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జపాన్‌లో భూకంపాలు వచ్చినా అక్కడి ఆధునిక సాంకేతికత, పటిష్ఠమైన భవన నిర్మాణాల వల్ల నష్టం తక్కువగా ఉంటుందని పిటిషన్‌లో ప్రస్తావించారు. అదే తరహాలో ఇక్కడ కూడా ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, విపత్తు నిర్వహణ చర్యలు చేపట్టేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వాదనలను తోసిపుచ్చింది. 'మన దేశ పరిస్థితులను జపాన్‌తో ఎలా పోలుస్తారు? అలా పోల్చాలంటే ముందు మన దేశంలోకి అగ్నిపర్వతాలను తీసుకురావాలి. భూకంపాల నష్టాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాల్సింది ప్రభుత్వం... న్యాయస్థానం కాదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

## బధిరులకూ ఓటీటీ కంటెంట్

**కేంద్రం కీలక మార్గదర్శకాలు**

న్యూఢిల్లీ: ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు అందిస్తున్న ఆడియో, వీడియో కంటెంట్‌ను వినికిడి, దృష్టి లోపం ఉన్నవారికి కూడా అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ నేడు రాజ్యసభకు వెల్లడించారు. 'ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్ అందుబాటు'కు సంబంధించి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ ఏడాది అక్టోబర్ 7న ప్రజాభిప్రాయం కోసం ఈ ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

## చైనా నిపుణులకు వేగంగా బిజినెస్ వీసాలు

**నిబంధనలు సడలించిన భారత్**

న్యూఢిల్లీ: చైనాకు చెందిన వృత్తి నిపుణులకు బిజినెస్ వీసాలను వేగంగా జారీ చేసేందుకు భారత ప్రభుత్వం నిబంధనలను సడలించినట్లు తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఇది ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. సంబంధిత అధికారులను ఉటంకిస్తూ ప్రముఖ వార్తా సంస్థ 'రాయిటర్స్' ఈ మేరకు ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ కొత్త సడలింపుల వల్ల వీసా జారీలో అనవసర జాప్యం తగ్గిపోతుందని, వ్యాపార సంస్థలకు నిపుణుల కొరత ఏర్పడకుండా ఉంటుందని అధికారులు వెల్లడించినట్లు రాయిటర్స్ పేర్కొంది. వీసా ఆమోద ప్రక్రియను నాలుగు వారాలలోపే పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారని, గతంలో ఉన్న కొన్ని పరిశీలన స్థాయిలను కూడా తొలగించారని వారు వివరించారు.

## నితీశ్ సర్కారుకు లాలూ కూతురి ప్రశంసలు

పాట్నా: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య నితీశ్ కుమార్ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో మహిళల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆమె కొనియాడారు. అయితే, స్త్రీల అభివృద్ధికి రూ.10 వేలు పంపిణీ చేయడం, పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు ఇవ్వడం మాత్రమే సరిపోదని, కొడుకులతో సమానంగా కుమార్తెలకు హక్కులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కుమార్తెల హక్కులను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే అని ఆమె అన్నారు. ప్రజల్లో పాతుకుపోయిన పితృస్వామ్య మనస్తత్వం, రాజకీయ రంగాలలో మార్పు తీసుకురావాల్సిన అవసరాన్ని ఆమె ప్రస్తావించారు. తల్లిదండ్రుల ఇళ్లలో కుమార్తెలు ఎటువంటి భయం లేకుండా సురక్షితంగా ఉండే హక్కు వారికి ఉందని అన్నారు.

లవ్లీ చిత్రం



నియతి ఫత్నానియతి



## అఖండ 2కు హైకోర్టులో రిలీఫ్

తెలంగాణలో నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కాంబినేషన్ లో రూపొందిన అఖండ 2: తాండవం మూవీకి సంబంధించి టికెట్ ధరలతోపాటు ముందస్తు ప్రీమియర్ల వ్యవహారం ప్రస్తుతం ఆ రాష్ట్ర హైకోర్టులో ఉన్న విషయం తెలిసిందే. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను చిత్ర నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌కు వెళ్లడంతో.. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై డిసెంబర్ 14వ తేదీ వరకు స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. తదుపరి విచారణను 15వ తేదీకి వాయిదా వేసింది. దీంతో అఖండ 2 నిర్మాణ సంస్థకు తాత్కాలిక ఊరట లభించినట్లైంది.

# బాలయ్య రుద్ర తాండవం

కొన్ని సినిమాలకు లాజిక్స్ తో అసలు పనిలేదు. జస్ట్ స్క్రీన్ మీద జరిగే మ్యాజిక్ చూసి ఎంజాయ్ చేయాలంతే. అఖండ తాండవం అలాంటి సినిమానే.. కథతో పనిలేదు.. కథనంతో అవసరం లేదు. జస్ట్ స్క్రీన్ మీద అలా బాలయ్య త్రిశూలం తిప్పుతూ వస్తే చాలు. మీరు పెట్టిన డబ్బులకు పైసా వసూల్ అయిపోయినట్టే. కరెక్ట్ టైంలో బయట నడుస్తున్న ట్రెండ్ పట్టుకొని సనాతన హైందవ ధర్మం గురించి చెప్పాడు బోయపాటి శ్రీను. అది కూడా అందరికీ అర్థమయ్యేలా కమర్షియల్ అంశాలు జోడించి బుర్రలోకి బాగా ఎక్కించాడు బోయపాటి. నాకు తెలిసి ఈ సినిమా బాలయ్య తప్ప ఇంకెవరూ చేయలేరు. ఇలాంటి సినిమా చేయాలంటే డైలాగులు చెప్పడం వస్తే సరిపోదు.. మంత్రాలు చెప్పడం కూడా రావాలి. అలాంటి సంస్కృత శ్లోకాలు, డైలాగ్స్ కేవలం బాలయ్యకు మాత్రమే సాధ్యమేమో. సినిమా అంతా దేవుడు చుట్టూనే జరిగింది. ఎప్పటిలాగే తొలి గంట ఎలాగోలా గడిపేసి.. ఇంటర్వెల్ ముందు పెద్ద బాలయ్యను దించేశాడు బోయపాటి. ఆయన రావడంతోనే డ్యూటీ ఎక్కేసాడు. అఖండతో పాటు తమన్ కూడా. ఎంతలా అంటే బాలయ్య అలా మామూలుగా నడిచేస్తున్నా కూడా వెనకాల ఢమరుకాలు మోగించాడు తమన్. ఆ వాయింపుతో థియేటర్లలో స్పీకర్లకు పట్టిన తుప్పు మొత్తం వదిలిపోతుంది. ఇంటర్వెల్ కు తాండవం మొదలుపెట్టిన బాలయ్య క్లైమాక్స్ వరకు ఆపలేదు. చూడ్డానికి రొటీన్ కథలాగే అనిపించినా కూడా ఇందులో మూలాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా సనాతన హైందవ ధర్మం గురించి చెప్పిన సన్నివేశాలు చాలా బాగున్నాయి. సెకండ్ హాఫ్ లో ఎవరు ఊహించని కామియో ఒకటి ఉంటుంది.. అది వచ్చినప్పుడు అందరికీ గూస్ బంప్స్ గ్యారెంటీ. బాలయ్య మరోసారి తన రుద్ర తాండవం చూపించాడు. సంయుక్త మీనన్ చాలా చిన్న క్యారెక్టర్ చేసింది. మరో కీలకమైన పాత్రలో హర్షాలి మల్హోత్రా మెప్పించింది. ఆది పినిశెట్టి విలన్ గా బాగున్నాడు. తమన్ మరోసారి స్పీకర్లు పగలగొట్టే బాధ్యత తీసుకున్నాడు. బోయపాటికి బాలయ్య దొరికితే పూనకాలు వచ్చేస్తాయి. ఈసారి అదే చేశాడు.

**ఓవరాల్‌గా అఖండ తాండవం.. థియేటర్లలో రుద్రతాండవం**

సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు

## పాపరాజీలే బాలీవుడ్ ఊపిరి!

బీటౌన్ తారల వ్యక్తిగత జీవితాలు, ఫ్యాషన్, కొత్త ప్రాజెక్ట్ ల గురించి అభిమానులకు తెలియజేయడంలో పాపరాజీలు కీలక పాత్ర పోషిస్తారు. ముఖ్యంగా ఎయిర్ పోర్ట్‌లు, కేఫ్‌లు, పార్టీల వంటి చోట్ల నటీనటులను ఎప్పుడూ ఫాలో అవుతూ ఉంటారు. ఎవరైనా కనబడడమే ఆలస్యం.. వెంటనే కెమెరాలతో క్లిక్ కొట్టి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేస్తుంటారు. అయితే సెలబ్రిటీలు కూడా ప్రమోషన్స్ కోసం వారిని యూజ్ చేసుకుంటారు. సినిమా విడుదలైనప్పుడు లేదా ఈవెంట్ జరిగినప్పుడు తమను తాము మార్కెట్ చేసుకోవడానికి పాపరాజీలను అనేక మంది బాలీవుడ్ సెలబ్రిటీలు ఉపయోగించుకుంటున్నారు. కొందరు పాపరాజీలకు డబ్బులు కూడా చెల్లించి ప్రత్యేకంగా పిలిపించుకుంటారని సినీ వర్గాల్లో ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు అది నిజమేనని హీరోయిన్ ప్రియమణి తెలిపారు. గతంలో బీటౌన్ సినీ ఇండస్ట్రీలో పాపరాజీలు ముఖ్య భాగమని నటి హుమాఖురేషీ చెప్పారు. అందుకే వారితో హెల్తీ రిలేషన్ మెయింటైన్ చేయాలని అభిప్రాయపడ్డారు.



## దీనస్థితిలో నటి వాసుకి

దీనస్థితిలో ఉన్న హాస్య నటి వాసుకి (పాకీజా) వృద్ధాశ్రమంలో చేరారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. తమిళనాడుకు చెందిన ఆమె 1991లో మోహన్‌బాబు సినిమా 'అసెంబ్లీ రౌడీ'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. తర్వాత, మేజర్ చంద్రకాంత్, పెదరాయుడు, రౌడీగారి పెళ్లాం, బ్రహ్మ, పుణ్యభూమి నాదేశం తదితర సినిమాల్లో నటించారు. తదనంతరం చోటుచేసుకున్న పరిణామాల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆమె దుర్భర జీవితం గడుపుతున్న విషయం సామాజిక మాధ్యమాల్లో వెలుగులోకి రావడంతో శ్రీరామ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జల్లి కేశవరావు ఆశ్రయం కల్పించారు. 'నన్ను సినిమాకు పరిచయం చేసిన గురువు మోహన్‌బాబు కుటుంబం రుణం తీర్చుకోలేనిది. ఆయన తనయుడు మంచు విష్ణు నా పరిస్థితిని చూసి నా కళ్లకు శస్త్రచికిత్స చేయించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన సోదరులు చిరంజీవి, నాగబాబు రూ.4 లక్షల ఆర్థిక సాయం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహాయపడుతున్నారు. ఆధార్ కార్డులో చిరునామా మార్పునకు కేశవరావు సహకరించారు. జిల్లా కలెక్టర్.. పింఛనుతోపాటు బియ్యం కార్డు మంజూరు చేస్తే ఆదరువుగా ఉంటుంది. ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులకు నా వంతు సేవ చేస్తున్నా



## అల్లు అర్జున్ 'స్టైలిష్' లుక్

అల్లు అర్జున్ అంటేనే స్టైల్.. అలాంటి స్టైలిష్ స్టార్ ఇప్పుడు మరో స్టైల్‌తో దర్శనమిచ్చాడు. లేటెస్ట్ గా యంగ్ హీరో ప్రియదర్శి అండ్ కోర్ట్ సినిమా టీం బన్నీని కలిసిన పిక్స్ బయటకి రాగా ఇందులో అల్లు అర్జున్ లుక్స్ ఇంకా స్టైలింగ్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. మళ్ళీ వింటేజ్ బన్నీని చూస్తున్నట్టుగా అనిపించడంతో నెక్స్ట్ సినిమాలో మాత్రం కిక్ ఇచ్చే ట్రీట్ ఉంటుంది అని డిసైడ్ అయిపోయారు.



## మాస్ సాంగ్‌లో వెంకీ, చిరు

మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్ సినిమాలో విక్టరీ వెంకటేష్ ఒక స్పెషల్ రోల్ చేస్తున్నారు. సినిమాలో ఒక సాంగ్ కూడా ప్లాన్ చేస్తున్నారట. ఈ సాంగ్ లో చిరంజీవి, వెంకీ ఇద్దరు అదరగొట్టేస్తారని టాక్. అంతేకాదు ఇద్దరికి ఒక హుక్ స్టెప్ ఉంటుందని ఆ సాంగ్ రిలీజ్ అయ్యాక ఫ్యాన్స్ అంతా ఆ హుక్ స్టెప్పుతో సోషల్ మీడియా సెన్సేషన్ గా చేస్తారని అంటున్నారు. సిల్వర్ స్క్రీన్ పై ఇద్దరు సీనియర్ స్టార్స్ చేసే ఈ హంగామా ఫ్యాన్స్ కే కాదు సినీ లవర్స్ కి కూడా సూపర్ ట్రీట్ ఇస్తుందని అంటున్నారు. ఆడియన్స్ పల్స్ తెలిసిన డైరెక్టర్ గా అనిల్ రావిపూడికి ఇప్పటికే సూపర్ క్రేజ్ ఉంది.

## త్వరలో రాజా సాబ్ జర్నీపై వీడియో!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్గా దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న చిత్రం రాజా సాబ్. ఈ సినిమా గ్రాండ్ విజువల్ అండ్ హారర్ ఎంటర్టైనర్‌గా రాబోతుంది. ఆన్ టైం రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్న ఈ సినిమా నుంచి మేకర్స్ లేటెస్ట్ గా ఓ ఇంట్రెస్టింగ్ మూవ్ ని అనౌన్స్ చేశారు. దర్శకుడు ఓ వీడియోతో తమ రాజా సాబ్ రిలీజ్ కి ముందు తమ రాజా సాబ్ ప్రపంచంలోకి తీసుకెళ్ళబోతున్నామని తెలిపారు. అసలు సినిమా ప్రపంచాన్ని ఎలా సృష్టించారు. దీని వెనుక ఉన్న కష్టం, సెట్స్ ఇంకా వి ఎఫ్ ఎక్స్ పనుల్లో ఏం జరిగింది అనే లాంటి వాటి జర్నీపై ఒక వీడియో లాంటి ట్రీట్ ని త్వరలోనే అందిస్తాం అన్నట్టుగా తెలిపారు. సో ఇంకొన్ని రోజుల్లో రాజా సాబ్ పై మంచి ట్రీట్ ఆన్ ది వే అని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహిస్తోంది.





# చప్పగా.. ఐటం సాంగ్స్!

**సినిమాల్లో ఐటం సాంగ్స్ అంటే ఉర్రూతలూగిస్తాయి. కానీ 2025లో మాత్రం స్పెషల్ సాంగ్ ఒక్కటంటే ఒక్కటి అదుర్స్ అనిపించేలా రాలేదు. అర్జున్ రెడ్డి హీరోయిన్ షాలిని పాండే రాహు కేతు సినిమాలో మధిర అనే సాంగ్ చేసింది. పులకిత్ సామ్రాట్, వరుణ్ శర్మ తో చేసిన ఈ సాంగ్ పెద్దగా ఆకట్టుకోలేదు.**

షాలిని గ్లామర్ తో ఎంత ఎట్రాక్ట్ చేయాలని చూసినా కూడా సాంగ్ ఆడియన్స్ ని ఇంప్రెస్ చేయలేకపోయింది. ఇదే క్రమంలో ఒకప్పటి స్టార్ హీరోయిన్ శ్రీయ శరన్ తో కనకం అనే స్పెషల్ అంగ్ ప్లాన్ చేశారు నాన్ వైలెన్స్ టీం. కానీ ఆ సాంగ్ కూడా ఆకట్టుకోవడంలో విఫలమైంది. మెట్రో శిరీష్ చేసిన ఈ సినిమాకు యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందించాడు. ఐతే అసలేమాత్రం ఆకట్టుకోలేని ఈ స్పెషల్ సాంగ్ ఆడియన్స్ ఎట్రాక్షన్ ని సంపాదించలేదు. నెక్స్ట్ అందాల భామలు కృతి శెట్టి, కళ్యాణి ప్రియదర్శన్ చేసిన జినీ స్పెషల్ సాంగ్ కూడా ప్రేక్షకుల మనసులు గెలుచుకోలేదు. రవి మోహన్ హీరోగా చేస్తున్న ఈ సినిమాలో ఈ సాంగ్ ఎట్రాక్ట్ చేస్తుందని అనుకోగా టార్గెట్ మిస్ అయ్యింది. అందాల భామలు ఇద్దరు గ్లామర్ ట్రీట్ చేసినా కూడా లాభం లేకపోయింది. ఇక ఇదే దారిలో బాగి 4లో జాకీ ష్రాఫ్ కోసం సోనం బజ్వా చేసిన స్పెషల్ సాంగ్ కూడా అసలేమాత్రం ఆకట్టుకోలేదు. సోనం లుక్స్ పరంగా ఇంప్రెస్ చేసినా సాంగ్ మాత్రం ఎలాంటి బజ్ క్రియేట్ చేయలేదు. స్పెషల్ సాంగ్ కి కేరాఫ్ అడ్రస్ అయిన మలైకా అరోరా చేసిన థమ సాంగ్ కూడా ఈసారి ఆడియన్స్ ని ఇంప్రెస్ చేయలేకపోయింది. సాంగ్ లో మలైకా అందాల మాయ చేసినా కూడా సాంగ్ పరంగా ఆడియన్స్ ని ఆకట్టుకోలేదు. ఐతే ఈ సాంగ్స్ అన్నీ కూడా స్పెషల్ అప్పియరెన్స్ గా వచ్చినా అవి ఆడియన్స్ హృదయాలను చేరడంలో ఫెయిల్ అయ్యాయి. ఐతే థమన్నా చేసిన స్పెషల్ సాంగ్స్ మాత్రం ఇంప్రెస్ చేశాయి. ఘఫూర్ వెబ్ సీరీస్ తో పాటు రైడ్ 2 కోసం చేసిన సాంగ్ కూడా స్పెషల్ సాంగ్ లవర్స్ ని అలరించాయి. మిల్కీ బ్యూటీ స్పెషల్ సాంగ్ కి పర్ఫెక్ట్ అని మరోసారి ఈ సాంగ్స్ తో ప్రూవ్ చేసుకుంది.





# వైభవోపేతం

## సూర్యవంశీ మళ్లీ విధ్వంసం.. 234 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం

**అండర్ 19 ఆసియా కప్ 2025 టోర్నమెంట్‌లో భారత్ శుభారంభం చేసింది. దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆతిథ్య యూఏఈ జట్టును 234 పరుగుల భారీ తేడాతో చిత్తుచేసింది. ఈ విజయంలో వైభవ్ సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్‌తో రెచ్చిపోయి ఈ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వైభవ్ సూర్యవంశీ కేవలం 95 బంతుల్లో 171 పరుగులు సాధించగా.. భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 433 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.**

ఈ 400 ప్లస్ స్కోరు అండర్-19 వన్డేల్లో భారత్‌కు అత్యధికం కాగా.. అండర్-19 ఆసియా కప్ చరిత్రలోనే అత్యధిక స్కోరుగా నిలిచింది. వైభవ్ సూర్యవంశీ, యూఏఈ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తన అద్భుతమైన ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్సర్లు, 9 ఫోర్లు బాదాడు. అండర్-19 స్థాయిలో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. వైభవ్ సూర్యవంశీ 30 బంతుల్లో అర్ధ సెంచరీ, కేవలం 56 బంతుల్లో సెంచరీ పూర్తి చేయడం విశేషం. 9 ఫోర్లు, 14 సిక్సర్లతో కూడిన అతని 171 పరుగుల ఇన్నింగ్స్, యూత్ వన్డేల్లో భారత్ తరఫున రెండో అత్యధిక స్కోరుగా నిలిచింది. 2002లో అంబటి రాయుడు ఇంగ్లాండ్‌పై చేసిన అజేయ 177 పరుగులు అగ్రస్థానంలో ఉంది. ఆరోన్ జార్జ్ (69)తో కలిసి వైభవ్ 212 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. సూర్యవంశీతో పాటు విహాన్ మల్హోత్రా (69), ఆరోన్ జార్జ్ (69) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆ తర్వాత వేదాంత్ త్రివేది (38), అభిజ్ఞాన్ కుందు (32 నాటౌట్), కనిష్క్ చౌహాన్ (28) ధాటిగా ఆడటంతో భారత్ 400 పరుగుల మార్కును దాటింది. 434 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో యూఏఈ జట్టు ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. 4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి, త్వరత్వరగా కీలక వికెట్లు పడగొట్టుకుంది. 48 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే యూఏఈ తరఫున పృథ్వీ మధు (50), ఉద్దిష్ సూరి (78 నాటౌట్) పోరాడి అర్ధ సెంచరీలు నమోదు చేశారు. ఈ ఇద్దరూ కలిసి 85 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పినా, లక్ష్యం మరీ పెద్దది కావడంతో ఫలితం లేకపోయింది. నిర్ణీత 50 ఓవర్లలో యూఏఈ 7 వికెట్ల నష్టానికి 199 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత్ 234 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి టోర్నీని ఆత్మవిశ్వాసంతో ప్రారంభించింది.



### 17 ఏళ్ల ప్రపంచ రికార్డు బ్రేక్

వైభవ్ సూర్యవంశీ 95 బంతుల్లో 9 ఫోర్లు, 14 సిక్సర్ల సాయంతో ఏకంగా 171 పరుగులు చేశాడు. డబుల్ సెంచరీని కొద్దిలో కోల్పోయినప్పటికీ.. వైభవ్ ఈ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 17 ఏళ్ల ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి చరిత్ర సృష్టించాడు. భారత్ ఇన్నింగ్స్‌లోని 33వ ఓవర్‌లో ఉదిశ్ సూరి బౌలింగ్‌లో ఔటయ్యే సమయానికి వైభవ్ తన పనిని పూర్తి చేశాడు. అండర్-19 వన్డే మ్యాచ్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. 2008లో నమీబియాపై ఆస్ట్రేలియాకు చెందిన మైకేల్ హిల్ 12 సిక్సర్లతో 124 పరుగులు చేసి నెలకొల్పిన 17 ఏళ్ల రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టాడు. యూఏఈపై వైభవ్ 14 సిక్సర్లు కొట్టి కొత్త ప్రపంచ రికార్డును తన పేరున లిఖించుకున్నాడు. ఇది ఇండియన్ బ్యాటర్లలో అత్యధిక సిక్సర్ల రికార్డు కూడా. అయితే, వైభవ్ రికార్డును కొద్దిసేపటికే పాకిస్తాన్ ఆటగాడు సమీర్ మిన్హాస్ బద్ధలు కొట్టాడు. మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో సమీర్ మిన్హాస్ 177 పరుగుల అజేయ ఇన్నింగ్స్‌తో వైభవ్ రికార్డును అధిగమించాడు.




## అంధుల ప్రపంచ కప్ వీరులకు పవన్ సన్మానం

ప్రపంచ కప్‌ను సాధించిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టును ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఘనంగా సత్కరించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రపంచ కప్ గెలిచిన క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రపంచ కప్ సాధించిన క్రీడాకారిణులను ప్రత్యేకంగా అభినందించారు. విజేత జట్టులోని ఒక్కో క్రికెటర్‌కు రూ. 5 లక్షల చొప్పున చెక్కులను అందించారు. శిక్షకులకు కూడా రూ. 2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ప్రతి మహిళా క్రికెటర్‌కు పట్టు చీర, శాలువాతో పాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా అంధ క్రికెటర్లు సాధించిన విజయం దేశానికే గర్వకారణమని పవన్ కళ్యాణ్ కొనియాడారు. అంధ క్రికెటర్ల ప్రాక్టీస్ కోసం దేశవ్యాప్తంగా ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, వారికి అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్వయంగా విజ్ఞప్తి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, మహిళా క్రికెటర్లు తెలిపిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.

## రెజ్లర్ వినేశ్ ఫొగట్ యూటర్న్

### రెజ్లింగ్‌లోకి తిరిగి వస్తా

**2028 ఒలింపిక్స్‌లో పాల్గొంటా: ఫొగట్**



భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. రెజ్లింగ్‌లోకి తిరిగి వస్తున్నట్లు ఆమె ప్రకటించింది. 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో పాల్గొనాలని వినేశ్ ఫొగాట్ లక్ష్యంగా పెట్టుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్ ఫొగాట్ కనీసం రజత పతకాన్ని ఖాయం చేసుకుని ఫైనల్‌కు చేరుకుంది. ప్రపంచ నంబర్ వన్ రెజ్లర్‌ను కూడా ఓడించింది. అయితే ఫైనల్‌కు ముందు వినేశ్ ఫొగట్ బరువు నిర్దేశించిన దాని కంటే ఎక్కువగా ఉండటం వల్ల డిస్‌క్వాలిఫై అయింది. దీనిపై పెద్ద వివాదం చెలరేగింది. మెడల్ గెలవాలన్న ఆమె కల చెదిరింది. దీంతో కుస్తీకి రిటైర్మెంట్ ప్రకటించి ఆ తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టింది. కాంగ్రెస్‌లో చేరి హర్యానాలోని జులనా నుంచి బీజేపీ అభ్యర్థి యోగేశ్ కుమార్‌పై విజయం సాధించి ఎమ్మెల్యేగా గెలుపొందింది. తాజాగా, వినేశ్ ఫొగట్ తన నిర్ణయాన్ని మార్చుకుని రెజ్లింగ్‌లోకి తిరిగి వచ్చే విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. లాస్ ఏంజెల్స్ 2028 ఒలింపిక్స్‌లో పాల్గొనాలని ఆమె ఆశిస్తోంది. 'పారిస్ ఒలింపిక్స్‌తో నా ప్రయాణం ముగిసిందా అని చాలా మంది అడిగారు. చాలా కాలం వరకు నా దగ్గర సమాధానం లేదు. నాకు ఒత్తిడి, అంచనాలు, చివరికి నా కలలకు కూడా దూరంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. కొన్నేళ్లలో మొదటిసారిగా, నేను శ్వాస తీసుకునేందుకు సమయం దొరికింది. నా ప్రయాణం భారాన్ని అర్థం చేసుకోవడానికి సమయం తీసుకున్నాను – ఎత్తుపల్లాలు, గుండె బద్దలు, త్యాగాలు, ప్రపంచం చూడని నా రూపాలు. ఆ ఆలోచనలలో ఎక్కడో, నాకు నిజం దొరికింది, నాకు ఇప్పటికీ ఈ ఆట అంటే ఇష్టం. నేను ఇప్పటికీ పోటీ పడాలనుకుంటున్నాను' అని పేర్కొంది. 'ఆ నిశ్శబ్దంలో నేను మర్చిపోయిన ఒక విషయం దొరికింది – ఆ మంట ఎప్పటికీ చల్లారదు. అది అలసట కింద అణిచివేయబడింది. క్రమశిక్షణ, నిత్యకృత్యం, పోరాటం.. ఇదంతా నా సిస్టమ్‌లో ఉంది. నేను ఎంత దూరంగా వెళ్లినా, నాలో ఒక భాగం మ్యాట్‌పైనే ఉండిపోయింది' అని కొనసాగింపుగా పోస్ట్ చేసింది.



## చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లకు గ్రీన్ సిగ్నల్

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకున్న తర్వాతే మ్యాచ్‌లకు అనుమతి ఇస్తున్నట్లు డిప్యూటీ సీఎం, బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి డీకే శివకుమార్ శుక్రవారం ప్రకటించారు. బెలగావిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. "బెంగళూరు నగరం ప్రతిష్ఠను కాపాడటానికే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తాం" అని శివకుమార్ తెలిపారు. భద్రతా ఏర్పాట్లను హోంమంత్రి జి. పరమేశ్వర పర్యవేక్షిస్తారని, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్, పోలీసు అధికారులతో చర్చించి తుది ప్రణాళికను సిద్ధం చేస్తారని వివరించారు. నిన్న రాత్రి జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జూన్ 4న జరిగిన ఓ విజయోత్సవ వేడుక సందర్భంగా స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగి 11 మంది అభిమానులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటన తర్వాత చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణను నిలిపివేశారు. ఇటీవల కేఎస్‌సీఏ అధ్యక్షుడిగా ఎన్నికైన భారత మాజీ పేసర్ వెంకటేశ్ ప్రసాద్, ఇతర ఆఫీస్ బేరర్లు.. సీఎం, డిప్యూటీ సీఎంను కలిసి మ్యాచ్‌ల పునరుద్ధరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థన మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. తాజా నిర్ణయంతో 2026 ఐపీఎల్ సహా అన్ని మ్యాచ్‌లు ఇకపై ఇక్కడే జరగనున్నాయి.

## గిల్ ఫాం లేమి టీమిండియాకు లాస్: ఇర్ఫాన్ పఠాన్

శుభ్‌మన్ గిల్ ఫామ్ కోల్పోవడం భారత జట్టుకు శుభపరిణామం కాదని, టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. 'శుభ్‌మన్ గిల్ అద్భుతమైన బంతికి ఔటయ్యాడు. నిజానికి అతడు ఫామ్‌లో ఉండి ఉంటే ఆ బాల్‌ను చాలా తేలిగ్గా ఆడేవాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ విషయానికొస్తే.. తన ఆఫ్‌సైడ్ ఆట మీద దృష్టి కేంద్రీకరించాలి. ఔటైనప్పుడు అసలు పొజిషన్‌లో లేడు' అని ఇర్ఫాన్ అన్నాడు. 'శుభ్‌మన్ గిల్ బ్యాట్ నుంచి పరుగులు రాకపోవడం టీమ్‌ఇండియాకు మంచి సంకేతం కాదు. అది అతడితోపాటు టీమ్ మేనేజ్‌మెంట్ మీద కూడా ఒత్తిడిని పెంచుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే.. ఒకవేళ జట్టులోకి సంజుశాంసన్‌ను తీసుకొచ్చినా వెంటనే ఆశించిన ఫలితం కనిపించకపోవచ్చు' అని పేర్కొన్నాడు. 'కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఆటగాడిగా వరుసగా విఫలమవుతున్నాడు. దీంతో అతడు తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాడు. టీ20 వరల్డ్ కప్‌లోగా ఫామ్ అందిపుచ్చుకోవాలి. అతడు సరైన బ్యాటింగ్ ఆర్డర్‌లో రావాలి. అలాగే అతడి షాట్ సెలక్షన్ సరిగ్గా ఉండాలి. సూర్య.. నేరుగా వస్తున్న బంతుల్ని కూడా లెగ్‌సైడ్ ఆడే ప్రయత్నంలో ఔట్ అవుతున్నాడు. ఆ విషయం మీద అతడు దృష్టి సారించాలి. ఎప్పుడైతే బ్యాటర్ ఫామ్‌లో ఉండరో.. అప్పుడు అతడు ఆఫ్‌సైడ్, నేరుగా బంతిని ఆడే ప్రయత్నం చేయాలి' అని సూచనలు చేశాడు.

## ఐసీసీతోనే జియోస్టార్

### టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లకు బేఫికర్

భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పురుషుల టీ20 వరల్డ్ కప్ సమీపిస్తున్న వేళ ఐసీసీ కీలక ప్రకటన చేసింది. ఆర్థిక నష్టాల కారణంగా మీడియా ప్రసార హక్కులను జియోస్టార్ రద్దు చేసుకోనుందనే వార్తలన్నీ అవాస్తమని ప్రకటించింది. ఐసీసీతో కుదుర్చుకున్న నాలుగేళ్ల ఒప్పందానికి జియోస్టార్ కట్టుబడి ఉందని శుక్రవారం ఇరు సంస్థలు సంయుక్తంగా వెల్లడించాయి. దాంతో.. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ వరకూ ఐసీసీ, జియోస్టార్ ఒప్పందంలో ఏ మార్పూ లేదని స్పష్టమైంది. 'ఐసీసీతో కుదుర్చుకున్న నాలుగేళ్ల ఒప్పందానికి జియోస్టార్ కట్టుబడి ఉంది. వచ్చే ఏడాది భారత్ వేదికగా జరుగబోయే టీ20 వరల్డ్‌కప్ సహా ఇతర ఐసీసీ ఈవెంట్లను ఎలాంటి అంతరాయం లేకుండా వరల్డ్ క్లాస్ కవరేజీ ఇవ్వడంపై ఇరుసంస్థలు దృష్టి సారిస్తున్నాయి.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 13-12-2025
www.evarthalu.com



# విభూది వస్త్రం.. త్రిశూలమే అస్త్రం



**హుక్కా.. గుట్కా.. నార్కోటిక్స్..**
**ప్రతీదీ వాళ్లకు ప్రసాదమే..**
**ఎండా.. వానా.. చలి..**
**అన్ని కాలాల్లో ఆనందమే..**
**ఒంటిపై నూలుపోగు ఉండదు.**
**విభూతే వారికి వస్త్రం.. త్రిశూలమే అస్త్రం..**
**అందరూ ఈశ్వరుడి ప్రతిరూపాలే..**

ఏమైనా అనుకోండి.. పిచ్చివాళ్లని నిందించుకోండి... వెర్రిబాగుల వాళ్లని వెక్కిరిం చండి... వంటిమీద నూలుపోగైనా లేకుండా తిరుగుతున్నారని ఆక్షేపించండి... శరీరంనిండా విభూతి రాసుకున్నారని నొసలు నొక్కుకొండి.. హుక్కా పీలుస్తున్నారంటూ ఆశ్చర్యపోండి... మీరేమనుకున్నా వారికి మీ ఊసులు అక్కరలేదు.. వారికి మీ అభిప్రాయాలతో పని లేదు.. వారికి లోకంతో పని లేదు.. లోకం తమ గురించి ఎన్ని మాట్లాడుకున్నా వారికి అవసరం లేదు.. ఎవరు వారు? ఎక్కడి నుంచి వచ్చారు? ఎక్కడ ఉంటారు? ఏం చేస్తారు? ఇంటి నుంచి బయటకు కాలు మోపితే, అంతా మనల్నే చూడాలని ఎంత తాపత్రయ పడతాం? ఆడామగా తేడా లేకుండా అద్దం ముందు నిలబడి గంటల తరబడి తయారవటం తెలిసిందే.. ఒంటి అలంకారం కోసం వాడే కాస్మోటిక్స్ అన్నీ ఇన్నీ కావు. పర్ఫ్యూమ్స్ గురించయితే చెప్పనే అక్కర్లేదు.. వంద గ్రాముల పర్ఫ్యూమ్ను వంద పదులైనా సరే కొనటానికి వెనుకాడం. కానీ, ఇవన్నీ అక్కరలేని జాతి నాగా. ఇది మన దేశంలోనే ఉంది.. మన మధ్యలోనే ఉంది.. ఆ జాతికి వీటితో పనే లేదు.. ఎవరితోనూ ఆ జాతికి సంబంధమూ లేదు.. వారు ఎవరికీ అర్థం కారు.. ఎవరి అపార్థాలతో వారికి పని లేదు.. అలంకారాలు అక్కర లేదు.. జుట్టు జడలు కట్టినా పట్టింపులేదు.. ఆహార్యం ప్రధానం కాదు.. నగ్నత్వమే వారి వేషం.. ఆహారం ముఖ్యం కాదు.. దొరికిందే తింటే చాలు.. రుచితో పనిలేదు.. శరీరంపై మోహం లేదు.. మృత్యువంటే భయం లేదు.. హిమాలయ సానువుల్లో నివాసం... పుష్కరం వస్తేనే జనంలోకి ప్రవాహం.. అడుక్కునే వాళ్లంటూ తిట్టేవాళ్లున్నారు.. అవధూతలని అర్చించేవారూ ఉన్నారు.. ఎవ్వరితోనూ వారికి అవసరం లేదు.

సాధారణంగా మనం నిత్యం చూసే సాధు సంతులకు కాషాయం, కమండలం, దండం అస్తిత్వాలు.. మిగతా రెంటి మాటెలా ఉన్నా, కాషాయం సన్యాసానికి ఒక విధంగా యూనిఫామ్ లాంటిది. ఎందుకంటే కాషాయం త్యాగానికి చిహ్నం. సన్యాసులు అన్నింటినీ త్యాగం చేసి వెళ్తారు కాబట్టి, సాధారణంగా వారు కాషాయాన్నే ధరిస్తారు.. ఇది కామన్ ఎలిమెంట్.. ఇందులో ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు లేవు.. కానీ ఎవరికీ అంతుపట్టని సాధువుల సమాజం వాళ్లది.. అది అత్యంత రహస్య సమాజం. హిమాలయ పర్వత శ్రేణుల్లో ఎక్కడ ఉన్నాయో తెలియని అఖారాల్లో ఉండే సాధు జాతి.. దాని పేరు నాగా, ఆ సన్యాసులే నాగా సాధువులు. మిగతా సొసైటీతో వీరికి ఎలాంటి సంబంధం లేదు.. తమ లోకంలోనే వారు జీవిస్తుంటారు.. అన్నింటినీ వదిలిపెట్టేసిన వారు.. చివరకు శరీరంపై బట్టల్నీ విడిచిపెట్టిన వాళ్లు.. నాగా సాధువులు. వీరు జనావాసాల్లోకి పుష్కరాల సమయంలోనే వస్తారు.. ఒకే ఒక్క ఊరేగింపుగా వచ్చి పవిత్ర స్నానాలు ఆచరించి పుష్కరాలు పూర్తికాగానే తిరిగి వారి ఆవాసాలకు వెళ్లిపోతారు. అంతే కాదు.. జనం మధ్యలోకి వచ్చినప్పుడు వీరి చేష్టలు విచిత్రంగా ఉంటాయి.. విడ్డూరంగా కనిపిస్తాయి.. త్రిశూలాలు ధరిస్తారు.. కత్తులు పట్టుకుంటారు.. వాటితో వీరంగం వేస్తారు.. వీరనాట్యాలు చేస్తారు.. కర్రసాము చేస్తారు.. హుక్కా, చిలుమ్ వంటి వాటి ద్వారా పొగాకు, నార్కొటిక్స్ వంటివి పీలుస్తారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని సాధువులని పిలవటం ఏమిటి? అదే మిస్టరీ... అతి కఠినమైన యోగ సాధనకు పరాకాష్ట.. సభ్య సమాజానికి ఏవైతే నిషేధాలో... అవన్నీ వారు చేస్తారు.. బట్టలు ధరించకపోవటమే ఒక సమస్య అనుకుంటే, హుక్కా, చిలుమ్ పీల్చటం, ఏది పడితే అది తినేయటం, ఒంటిని శుభ్రంగా కూడా ఉంచుకోకపోవటం, అన్నీ నెగెటివ్ షేడ్సే.. ఏమిటీ రహస్యం? పవిత్ర గంగా తీరంలో పుష్కరాలు వచ్చినప్పుడు నాగా సాధువులు విభూతి అలంకారాలతో శివ పంచాక్షరి నినదిస్తూ రావడం ఒక అపురూప సన్నివేశం.

హిమాలయాలు.. దేవతల ఆవాసాలంటారు.. నాగా సాధువులు ఉండేది కూడా ఈ హిమాలయాల పర్వత శ్రేణుల్లోనే.. కాకపోతే బయటి ప్రపంచానికి అందుబాటులో లేని మారుమూల పర్వత ప్రాంతాలను ఏరికోరి ఎంచుకుని మరీ తమ మెడిటేషన్ను కొనసాగిస్తారు. వారికి ఎండ లేదు.. వాన లేదు.. చలి లేదు.. విభూతే వారి శరీరాన్ని అన్నింటి నుంచీ కాపాడుతుంది. చిలుమ్, హుక్కా వంటివి శరీరంలో వేడిని కలిగిస్తాయి.. మనసుకు ఏకాగ్రతను కలిగిస్తాయి.. వారు శివుడిని, అగ్నిని ఆరాధిస్తారు.. మిగతా దేవుళ్లందరినీ పూజిస్తే వాళ్లు స్పందించే సరికి చాలా సమయం పడుతుందిట.. అగ్నిని ఆరాధిస్తే.. ఆయనకు ఆహుతులను అర్పిస్తే వెంటనే విభూతి రూపంలో ఫలితాన్ని అందిస్తాడట.. ఆ విభూతే నాగా సాధువులకు సర్వస్వం అవుతోంది.. విభూతి అంటే ఐశ్వర్యం. నాగా సాధువులకు ఈ విభూతే ఐశ్వర్యం.. సర్వ సంపదలూ ఈ విభూతే. పరమేశ్వరుడే స్వయంగా ధరించిన విభూతే వారికి సర్వాలంకారం. చూసే మనబోటి వాళ్లకు విచిత్రంగా అనిపించవచ్చు. కానీ, వారికి అది అవసరం లేదు. అత్యంత కఠినమైన యోగసాధన చేసి అన్నింటికీ అతీతమైన దశకు చేరుకున్న శివసైనికులు వీరు. ఉజ్జయిని.. మహా కాళేశ్వరుడిగా శివుడు పూజలందుకునే పవిత్ర పుణ్యక్షేత్రం. జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఉజ్జయిని కూడ ఒకటి. దేశంలోని మిగతా శైవ క్షేత్రాల కంటే ఉజ్జయినిలో ఒక విశిష్టమైన ఆచారం ఉంది. ప్రతి రోజూ రాత్రి పూట ఉజ్జయిని స్మశాన వాటికలో అప్పటికప్పుడు తాజాగా మండిన చితిలో నుంచి భస్మరాశిని తీసుకువచ్చి మహాకాళేశ్వరుడికి అభిషేకం చేస్తారు.. భస్మరాశి విభూతిగా మారిపోతుంది... మన శరీరమే విభూతి అని చెప్పటానికి ప్రతీక ఈ అభిషేకం. నాగా సాధువులు తమ శరీరానికి రాసుకునే విభూతి కూడా ఇదే. శరీరం ఎప్పటికైనా భస్మరాశిగానే మారాల్సి ఉంటుందనటాన్ని ఎక్స్ప్రెస్ చేయటమే దీని ఉద్దేశం. సాధువుల్లో నాగాలను సృష్టించింది దత్తాత్రేయుడని చెప్తారు. ఎప్పుడు, ఎలా సృష్టించిందీ ఎవరికీ తెలియదు.. సనాతన ఆధ్యాత్మిక ధర్మాన్ని రక్షించేందుకు ఆదిశంకరాచార్య నాగా సాధువులందరినీ ఒకటి చేశారని అంటారు.



మనం ఉంటున్న ఈ మెటీరియలిస్టిక్ వరల్డ్ను వీరు కేర్ చేయరు. ఆర్మీలో ఓ రెజిమెంట్లాగా నాగా సాధువులు ఉంటారు. వీళ్లు శివుడికి సైనికుల్లా వ్యవహరిస్తారు.. ఎవరినీ దగ్గరకు రానివ్వరు.. అఘోరాల్లా అతి తీవ్రంగా లేకపోయినా, వీరి దారి వేరు.. చాలా ఆవేశపరులు.. వారి ఆగ్రహం ప్రదర్శించటానికి బెస్ట్ ఆప్షన్గా పరిగెడ్తారు. ఇంకొందరు హింసాత్మకంగా కూడా మారతారు. వారి ఆశ్రమాల్లోకి కూడా ఎవరినీ రానివ్వరు.. సామాన్యులకు అసాధారణమైన యోగాసనాల్లో నాగా సాధువులు కనిపిస్తారు. సామాన్యంగా కనిపించే సన్యాసులకు, వీరికి అదే తేడా... అందుకే వీరిని నాగాలన్నారు. సాధువులుగా మారటం తేలికే.. సన్యాసం తీసుకోవటమే కష్టం. అన్ని సుఖాలను వదిలేసి ఆశ్రమ జీవితం గడపటం ఇంకా కష్టం. కానీ ఈ ఆశ్రమ జీవితాన్నీ వదిలేసి, శరీరాన్ని గాలికి వదిలేసి, నిద్ర, ఆహారాలను నిర్లక్ష్యానికి అప్పజెప్పేసి పూర్తిగా నాగాలుగా మారటం ఊహించినంత తేలిక కాదు. చాలా, చాలా కష్టపడ్డ తరువాత కానీ, నాగాలుగా మారటం కుదరనే కుదరదు. నాగా సాధువులు అంటే ప్రధానంగా దిగంబరులు.. ఇదెలా సాధ్యం? జీవితాంతం ఇలా ఉండటం ఎలా వీలవుతుంది? అదీ మంచు కొండల్లో.. గడ్డకట్టే చలిలో నూలుపోగైనా లేని ఒంటిని కేవలం విభూతి ఎలా రక్షిస్తుంది.. కాస్త మోతాదులో తీసుకునే మత్తు పదార్థాలు ఏమూలకు పనికి వస్తాయి? మరి వీళ్లెలా వుండగలుగుతున్నారు? నిజం.. ఇలా ఉండటం సామాన్యుడికైతే క్షణమైనా సాధ్యం కాదు.. నాగాలుగా మారేందుకు ఈ సాధువులు చాలా హోర్డ్వర్క్ చేయాల్సి ఉంటుంది. సర్వస్వం త్యాగం చేసి నాగాలుగా మారాలని అనుకున్న వారు ముందుగా ఇల్లూ వాకిలీ వదిలేసి సాధారణ సన్యాసం స్వీకరించాలి. ఆరు సంవత్సరాల పాటు కఠినమైన బ్రహ్మచర్యాన్ని అవలంబించాలి. అన్ని రుచులను వదిలేయాలి. అన్ని వాసనలకూ దూరంగా ఉండాలి. అన్ని సుఖాలను త్యాగం చేయాలి. అన్ని మోహాలను వదిలిపెట్టాలి. చివరకు వస్త్రాల్నీ వదిలేయాలి. ఇవన్నీ అనుకున్నంత ఈజీ ఏమీ కాదు.. ప్రతి విషయంపైనా ఏకాగ్రత సాధించటానికి చాలానే కష్టపడతారు. ఆ తరువాత అయిదుగురు గురువుల దగ్గర తమను తాము అన్నింటికీ అతీతంగా ఉండగలుగుతున్నట్లు నిరూపించుకోవలసి ఉంటుంది. ఆరు సంవత్సరాల బ్రహ్మచర్యంలో సాధువులు కౌపీనం అంటే లంగోటీ ధరించి వుంటారు.. ఒక్కో దానిపై మోహం తీరిపోయాక చివరగా ఆ కౌపీనాన్ని సైతం విడిచిపెడతారు. అంటే ఈ మెటీరియలిస్టిక్ వరల్డ్లోని సంసారం నుంచి తనను తాను నాగా సాధువు వేరు చేసుకున్నట్లని అర్థం. నేను అనే అహాన్ని విడిచేయడమే నాగా సాధువుల్లోని ప్రత్యేకత. బయటి శరీరం కంటే, లోపల ఆత్మ అన్నది ఒకటుందని వీరు గాఢంగా నమ్ముతారు.. ఆ ఆత్మే ప్రధానంగా జీవిస్తారు.. మిగతా శరీరంతో వారికి పని లేదు. కాబట్టి దాని గురించి పట్టించుకోరు. నాగా సాధువులు ఎక్కువగా ప్రయాణాలు చేయరు.. ఎక్కడికీ వెళ్లరు.. కేవలం కుంభమేళాలు జరిగినప్పుడే బయటకొస్తారు. ఈ లోకంలో ఈశ్వరుడికి అచ్చమైన ప్రతీకలు నాగ సాధువులు.



**కోవెల సంతోష్ కుమార్**
రచయిత, 9052116463

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.